# వార్త

ఆదివారం

5 నవంబరు, 2023

# గాజా గిజగిజ



తారాతీరం

# బాలయ్య సినిమాలో త్రిష?



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా త్రిష ఒక సమయంలో చక్రం తిప్పేసింది. అదే సమయంలో అంతే స్టార్ స్టేటస్‌ను కోలీవుడ్‌లోనూ చూసింది. చాలాకాలం పాటు ఆమె తన జోరును చూపించిన తరువాత రెండు భాషల్లో అవకాశాలు తగ్గాయి. ఆ సమయంలో ఆమె తమిళంలో నాయిక ప్రధానమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళ్లింది.

'పొన్నియన్ సెల్వన్' సినిమాతో ఆమె పాన్ ఇండియా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆమె గ్లామర్ రెట్టింపు కావడం చూసి అంతా షాక్ అయ్యారు. దాంతో ఆమెకి కోలీవుడ్ సీనియర్ హీరోల సరసన మళ్లీ అవకాశాలు రావడం మొదలైంది. 'లియో' కూడా అలా వచ్చిందే. 'లియో' చిత్రంలోనూ త్రిష చాలా అందంగా కనిపించింది. ఇక ఆమె టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోల సరసన సందడి చేయడం ఖాయమని చాలామంది అనుకున్నారు. అనుకున్నట్టుగానే ఆమెకు బాలయ్య సినిమాలో అవకాశం వచ్చినట్లు తెలుసోంది. బాబీ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను సితార బ్యానర్‌వారు నిర్మించనున్నారు. బాలయ్య ద్విపాత్రాభినయం చేయనున్న ఈ సినిమా వచ్చే ఏడాదిలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం.



# నాని కొత్త సినిమా 'సరిపోదా శనివారం'

నాని తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'హాయ్ నాన్న' సిద్ధమవుతోంది. ఈ సినిమా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈలోగా నాని మరో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ చిత్రం పేరు 'సరిపోదా శనివారం'. ఈ చిత్రానికి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. విజయదశమి సందర్భంగా ఈ సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. నాని సరసన ప్రియాంక అరుళ్‌మోహన్ అలరించనుంది. ప్రతినాయకుడిగా ఎస్.జె.సూర్య కనిపించనున్నాడు. జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నాడు.

జీవితంలో ప్రతి మనిషికి ఒకరోజు వస్తుంది. అలాంటి రోజు ప్రతి వారం వస్తే? అనే కాన్సెప్ట్‌తో రూపొందనున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త
5 నవంబరు, 2023

## మంచి ముత్యాలు

సంపదలుగాని, పేరు ప్రతిష్టలుగాని, గౌరవ మర్యాదలు గాని, పాండిత్యంగాని పనిచేయవు. ప్రేమ ఒక్కటే నిలిచి ఉంటుంది. స్వామి వివేకానంద

## విషయ విశేషం

విదేశాల్లో పైలట్ కోర్సులు... 4
'సంఘీ'భావం....5
సర్కారు దవాఖానాల్లో సమస్యల కొలువు
కవర్ స్టోరీ..6
గాజా గిజగిజ
ఆరోగ్యసిరి మిల్లెట్స్..11
ఈవారం కవిత్వం..12
రసమాధురి
సైబర్ భద్రత బాధ్యత మనదే..18
కథ.. 20
గల్లగురిగి
సాహిత్యం..23
కళాప్రపూర్ణ వేంకటరావు
విచిత్రమైన 'డయోమీడ్' దీవులు...25
ఓవర్‌హెడ్ ట్యాంకు ఏ దిక్కులో ఉండాలి?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### సాక్స్ పసిగడతాయి!



అసలే వృద్ధాప్యం..దానికి మతిమరుపు కూడా తోడయితే చెప్పేదేముంది..తమలోని అశక్తత కు వాళ్లలో విపరీతమైన ఆందళన, ఒత్తిడి, కోపం వంటివి కలుగుతుంటాయి. వాటిని వెంటనే గుర్తించి సముదాయించేందుకు బ్రిస్టల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జెకె స్టీర్ అనే శాస్త్రవేత్త సెన్సర్లు ఉన్న సాక్స్‌ను రూపొందించాడు. ఎందుకంటే వృద్ధుల బాగోగులు చూసుకునేందుకు అనుక్షణం పక్కన మనిషి ఉండక పోవచ్చు. అలాంటి పరిస్థితిలో వాళ్లలో ఆకస్మికంగా కలిగే ఆందోళనల్నిగానీ కోపావేశాల్నిగానీ తగ్గించేందుకు ఇవి ఉప యుక్తం అంటున్నారు. తన బామ్మలోని విపరీత ప్రవర్తనని చూసి సదరు శాస్త్రవేత్త వీటిని రూపొందించారట. 'మిల్బోటిక్స్' అనే స్టార్టప్ ద్వారా వీటిని మార్కెట్లోకి తీసుకు రానున్నారు. సాక్స్ మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఆప్ ద్వారా ఒకసారి స్కాన్ చేసుకుంటే చాలు..రోగుల గుండెరేటు, చెమట, శరీర కదలిక లన్నీ ఎప్పటికప్పుడు ఆప్‌లోకి వస్తుంటాయి. వృద్ధులు దేని గురించైనా ఆందోళన చెందుతుంటే సంబంధిత వ్యక్తి ఫోన్‌కి సందేశం వస్తుంది కాబట్టి వెంటనే తగిన జాగ్రత్త తీసుకోవచ్చు. ఇప్పటికే బ్రిటిష్ కేర్ హోమ్స్‌లోకి వృద్ధుల్లో ఈ సాక్స్ పరీక్షిం చారట. చక్కగా పనిచేస్తున్నాయనీ, వీటిని మామూలు సాక్స్ లానే ధరించి, వాష్ చేయవచ్చనీ అంటున్నారు.

### జోక్స్..జోక్స్

**రాజకీయ నాయకుడు:** మేం అధికారంలోకి వస్తే బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తాం.
**మరో రాజకీయ నాయకుడు:** మేం అధికారంలోకి వస్తే బస్సులనే ఫ్రీగా ఇస్తాం.
**ఇంకో రాజకీయ నాయకుడు:** మేం అధికారంలోకి వస్తే స్కూటర్లనే ఫ్రీగా ఇస్తాం.
**నాల్గో నాయకుడు:** మేం అధికారంలోకి వస్తే, అసలు మీరు బయటకు వెళ్లే పనే లేకుండా, అన్నీ పనులను మేమే చేసిపెడ్తాం.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# విదేశాల్లో పైలట్ కోర్సులు



విదేశాలలో చదువుకోవడం నేడు సాధారణమైన అంశం. విదేశీ చదువు అనగానే ఇంజినీర్, డాక్టర్ వంటి కోర్సులే గుర్తుకు వస్తాయి. అయితే ఈ కోర్సులతో పాటు పైలట్ చదువులకు కూడా అనుకూలమైన దేశాలు చాలానే ఉన్నాయి. నిజానికి పైలట్ ఉద్యోగం ఎంతో గ్లామరస్‌గా ఉంటుంది. అంతేకాదు ఆకర్షణీయమైన జీతాలు, విదేశీప్రయాణాలు కూడా చక్కగా ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా పైలట్ ఉద్యోగాలకి మంచి గిరాకీ ఉంది. వ్యాపారం, విహారాలు చాలా ఎక్కువ ఉంది. సమయ ఆదా కోసం విమానయాత్రలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. పైలట్ అవడానికి పెద్దగా చదువు అవసరం లేదు. ప్లస్ టూ లేదా ఏవియేషన్ డిప్లొమా వంటి లైసెన్సులు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం. ప్రైవేట్ పైలట్ లైసెన్సు, కమర్షియల్ పైలట్ లైసెన్సు, ఎయిర్ లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్సు అందులో ప్రైవేట్ పైలట్ లైసెన్సు ప్రాథమికమైనది. అంటే మన డ్రైవింగ్ లైసెన్సులా అన్నమాట. సరదా కోసం హాబీగా విమానం నడపడానికి పనికి వచ్చే లైసెన్సు ఇది. ఈ లైసెన్స్ కలిగిన వారు ఉద్యోగం కోసం అర్హత పొందలేరు దానికి కమర్షియల్ పైలట్ లైసెన్స్, ఎయిర్ లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్సు అర్హత పొందాలి. ఇంకా మరో విషయం కూడా ఉంది. ఆయా విదేశాలలో పైలట్ లైసెన్సు కోర్స్‌లు రకరకాలుగా ఉంటాయి. వాటిని తెలుసుకుని అప్లయ్ చేసుకోవాలి. సాధారణంగా వయసు పదిహేడు సంవత్సరాలు దాటాలి. ఏం-1 వీసా ఉండాలి, ఇంగ్లిష్ భాష వచ్చి ఉండాలి. మనదేశంలో కమర్షియల్ పైలట్ లైసెన్సు చాలు కానీ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్సు ఉంటే పోటీ అధిగమించవచ్చు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్,



కెనడా, దక్షిణఆఫ్రికా, ఫిలిప్పైన్స్, యుఏఈ, ఇంగ్లాండ్ వంటి దేశాలలో ఫ్లైట్ ట్రైనింగ్ లేదా పైలట్ కోర్సు అందిస్తోంది. ప్రపంచంలో అత్యుత్తమమైన పైలట్ ట్రైనింగ్ అందిస్తున్న దేశం అమెరికా. ఇక్కడ ఫ్లైట్ ట్రైనింగ్ కోర్సులో చేరడానికి ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అందిస్తున్న దేశం అమెరికా. ఇక్కడ ఫ్లైట్ ట్రైనింగ్ కోర్సులో చేరడానికి ట్రాన్స్‌ప్రర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ అను మతి అవసరం. అమెరికన్ పౌరులు కాని వారు ఈ కోర్సులో చేరినపుడు ప్రమాదాలు జరిగినపుడు వీటిలో తీసుకోవలసిన వివరాలు ఉంటాయి. అమెరికాలో పైలట్ ఉద్యోగం కోసం ఫెడరల్ అడ్మినిస్ట్రేషన్ పైలట్ లైసెన్సు పొందవలసి ఉంటుంది. అమెరికాలో వున్న పైలట్ లైసెన్సు కోసం చదవడానికి సుమారు కోటి రూపాయలు ఖర్చు చేయవలసి ఉంటుంది అని అంచనా. మనదేశం నుండి చాలామంది విద్యార్థులు పైలట్ కావడానికి కోసం అమెరికాలో చదువుతున్నారు. అమెరికా తరువాత ఎక్కువమంది విద్యార్థులు ఆస్ట్రేలియా వెళ్లి పైలట్‌కోర్సు చదవడానికి ఇష్టపడుతున్నారు. ఇక్కడ పైలట్ లైసెన్సు సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో అనుమతి పొందవలసి ఉంటుంది. ఇంకా న్యూజిలాండ్‌లో ఫ్లైట్ ట్రైనింగ్ కోర్సులో చేరడానికి ముందు స్టూడెంట్ పైలట్ లైసెన్సు పొందవలసి ఉంటుంది. ఆ తరువాత గ్రౌండ్ స్కూల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి. అన్ని దేశాలలోను ఇంచుమించుగా పైలట్ ట్రైనింగ్ చదవాడిని కోర్సు సుమారుగా ఒకేలా ఉంటాయి. ఖర్చు కూడా సుమారు కోటి రూపాయల వరకు ఖర్చు అవుతుంది. మనదేశంలో డైరక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వారి నియంత్రణలో పైలట్ లైసెన్సు పొందవచ్చు. పైలట్ అని వినేసరికి మనకి ఎక్కడో విహరించినట్లు అనిపిస్తుంది. మరి ఉద్యోగమే వస్తే భూమి మీద ఉండం కదా! ఆ హోదా, డ్రెస్‌కోడ్, జీతం.. ఆలస్యం ఎందుకు పైలట్ కోర్సులు చేసేందుకు ప్రయత్నిం చేయండి. ఆల్ ది బెస్ట్.

**- ఈ.ఎస్. మాధవన్**



## 'సంఘీ' భావం



# సర్కారు దవాఖానాల్లో సమస్యల కొలువు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలు కొలువుదీరి ఉండటంతో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క సౌకర్యాల కొరత ఉండగా మరోపక్క సిబ్బంది వైఖరితో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆసుపత్రుల నిర్వహణ కోసం ఏటా సుమారు ఆరు నుంచి ఏడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఆశించిన మేరకు ఫలితాలు లభించడం లేదు. గత దశాబ్దకాలంగా ఆసుపత్రుల నిర్వహణ మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. గతంతో పోలిస్తే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులకు అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. సిటి స్కాన్, ఎంఆర్ఐ, డయాలసిస్ యంత్రా లు వంటివి సమకూర్చుకోగలిగారు. అయితే వాటి నిర్వహణ విషయంలో మాత్రం తగిన నిధులు కేటాయించడం లేదు. ఆసుపత్రుల్లో కోట్లాది రూపాయల విలువైన పరికరాలు వృథాగా పడి ఉంటున్నాయి. వీటికి మరమత్తులు చేయకపో వడంతో వీటిని పూర్తి స్థాయిలో రోగులకు వినియోగించుకునే అవకాశం లేకుండా పోతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ అధికంగా ఉండటంతో మధ్యతరగతి కుటుంబాలు కూడా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే సర్కారు దవాఖానాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారు. కనీస స్థాయిలో పారిశుధ్యం అమలు కావడం లేదు. రాష్ట్రరాజధానిలోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది. మరుగుదొడ్లు ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో కావాల్సి న స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ కొత్త భవనాలు నిర్మించే ప్రయత్నాలు జరగడం లేదు. ప్రస్తుతం పాత భవనాన్ని ఉపయోగించకపోవడంతో స్థలాభావం ఏర్పడింది. పాతభవనం అందుబాటులో ఉన్నప్పుడు రోగులకు, వైద్యులకు ఎంతో వెసులుబాటు ఉండేది. సుమారు పది కోట్లు వినియో గిస్తే పాత భవనం అందుబాటులోకి వస్తుంది. రాష్ట్రముఖ్య మంత్రి కేసీఆర్ గతంలో పాతబస్తీలో ఉన్న చంచల్‌గూడ జైలును అక్కడి నుంచి తరలించి అక్కడ అత్యాధునికమైన భవనాన్ని నిర్మించి ఉస్మానియా ఆసుపత్రిని తరలించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల ఇది అమలుకాలేదు. కనీసం ఉన్న భవనాన్ని అయినా మరమత్తులు చేస్తే సమస్య పరిష్కారం అయ్యేది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు చికిత్స కోసం రోగులు తరలివస్తుంటారు. రోగులకు కొన్ని సందర్భాల్లో పడకలు కూడా సర్దుబాటు చేయలేని పరిస్థితి ఎదురౌతోంది. ఇక రోగుల బాగోగులు చేసేందుకు వచ్చే రోగి బంధువులు బస లేక ఇబ్బందులు పడుతున్నారు. గాంధీ ఆసుపత్రిలో ఒక హాలులో వారు విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. అయితే గ్రామాల నుంచి వచ్చే రోగులను పక్కదారి పట్టించే మోసగాళ్లు కూడా ఇక్కడ సంచరిస్తూ ఉంటారు. గతంలో చిన్నారుల కిడ్నాప్‌లు కూడా జరిగాయి. ఉస్మానియా ఆసుపత్రి వద్ద కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. పెద్ద సంఖ్యలో రోగులు రావడం, వారికి అనుగుణంగా వసతి లేకపోవడంతో ఇటు వైద్యులు, అటు రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఈ ఆసుపత్రుల్లో మందుల కొరత వెంటాడుతోంది. మందులు ఉన్నా అవికూడా కొన్నిరకాలు మాత్రమే లభిస్తున్నా యి. చాలావరకు మందులను బయట కొనమని చెబుతుంటా రు. కొన్ని పరీక్షలు చేసేందుకు అవకాశం లేకుండా ఉంది. రోగులకు కొన్ని రకాల మందులు, పరీక్షలు బయట చేయించు కోవాలని సూచిస్తున్నారు. దీనితో నిరుపేదలు ఆర్థిక ఇబ్బందు లను ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రుల పనితీరుపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు వాస్తవాలకు పొంతన ఉండటం లేదు. ఆసుపత్రులకు కేటాయించిన మందులు బయట మార్కెట్‌కు తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సరైన నిఘా ఉండటం లేదు. ఆసుపత్రుల్లో నియమించిన ప్రైవేటు సెక్యూరిటీ కూడా రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బు ఇచ్చిన వారిని వదిలిపెట్టి తమను మాత్రం అడ్డుకుంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చాలా ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. దీనితో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిపై పనివత్తిడి పెరుగుతోంది. ఒక్కొక్క వైద్యుడు గంటకు 15 నుంచి 20 మందిని పరీక్షించి మందులు రాయా ల్సి న పరిస్థితి ఉంది. ప్రభుత్వ వైద్యశాలకు వస్తే రోగం తగ్గిపోతుందనే నమ్మకం ప్రజల్లో సన్నగిల్లుతున్నది. ప్రత్యేకంగా నిరుపేదలకు ఈ ఆసుపత్రులే దిక్కు. ప్రైవేటు వైద్యం చేయించుకునే స్తోమత లేని పేదలు ప్రభుత్వ దావాఖానాలనే ఆశ్రయిస్తున్నారు. అందుబాటులో ఉన్న మందులను ఇచ్చినవే వాడుతున్నారు. రోగం నయం కావాలంటే వైద్యులు రాసిన మందులను వాడితేనే తగ్గుపోతుంది. అయినా చేసేదిలేక ఆసుపత్రులు ఇచ్చే అరకొర మందులను వాడి, నయం కాని రోగాలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం తగిన చర్యల్ని తీసుకుని, అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచిన ప్పుడే ఈ పేదలకు మేలు జరుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# గాజా గిజగిజ



కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

**అమెరికన్ రాజనీతిజ్ఞుడు హైరమ్ వారెన్ జాన్సన్ ప్రకారం 'యుద్ధం ఎప్పుడు వచ్చినా, తొలుత మరణించేది సత్యమే'. అయితే నియంతలకు ఉగ్రవాదులకు సామ్రాజ్యవాదులకు సత్యంతో పనిలేదు. ఎందుకంటే వారిలో నెలకొన్న ఉన్మాదం అటువంటిది. యుద్ధాన్ని వ్యతిరేకించే వాళ్లు ఎంతమంది ఉన్నారో అదే రీతిలో యుద్ధాన్ని కాంక్షించే వాళ్లు అంతేమంది ఉన్నారు. యుద్ధాల వల్ల సామ్రాజ్యస్థాపన కంటే అవి చేసిన నష్టాలే ఎక్కువని చరిత్రలో ఎన్నో సంఘటనల ద్వారా మనకు నిరూపితమయ్యింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య యుద్ధాలు రావడానికి అనేక కారణాలు ఉండొచ్చు కానీ ఈ యుద్ధాలు కారణంగా నష్టపోయేది చివరకు మరణించేది కూడా సామాన్య ప్రజానీకమే అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. చారిత్రంగా పరిశీలిస్తే విభిన్న యుద్ధాల వలన కలిగిన ప్రభావాలు ఈ విషయాన్ని రుజువు చేశాయి.**

తాజాగా ఇశ్రాయేల్ గాజా మధ్య జరుగుతున్న భీకర యుద్ధం కొత్త సంక్షోభాన్ని తీసుకువచ్చింది. అయితే ఎప్పటిలాగే ఈ యుద్ధాలలో సామాన్యులు పసికూనలు సైతం యుద్ధానికి బలి అవుతున్నారు. తినడానికి తిండిలేక, నిలువ నీడలేక తాగడానికి నీరు లేక చిన్నా పెద్దా తెడాలేకుండా భయోత్పాతంతో వణికిపోతున్న దయనీయ స్థితి నేడు పశ్చిమాసియాలో ఇశ్రాయేల్ గాజా యుద్ధంలో రావణాకాష్టంలా మనకు కనిపిస్తూ ఉంది. చమురు వనరులకు కొదవలేని పశ్చిమాసియాలో వనరులను కొల్లగొట్టుకుపోయేందుకు సామ్రాజ్యవాద దేశాలు పన్నిన కుటిల పన్నాగంలో భాగంగానే ఇశ్రాయేల్ పాలస్తీనాల మధ్య యుద్ధాలు కొనసాగుతున్నాయనేది జగమెరిగిన సత్యం. ఇశ్రాయేల్ యూదుల కోసం ప్రత్యేకంగా ఏర్పడిన దేశం. అంతేకాదు, ప్రపంచంలో యూదులు ఏ మూలన ఉన్నా సరే వారు తమ పౌరులేనని ప్రకటించిన దేశం. పాలస్తీనా ప్రాంతం నుండి యూరప్‌కు వెళ్లిన యూదులు నాజీల చేతిలో అమానవీయంగా ఊచకోతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో యూదులు అందరూ తమ మాతృభూమికి చేరుకోవాలి అనే పిలుపుతో 1920 నుంచి 1940 వరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యూదులు పాలస్తీనాకు తరలి వచ్చారు. అక్కడున్న అరబ్బులతో పొసగక ప్రత్యేక దేశం ఏర్పాటుకు ప్రయత్నించగా స్థానిక అరబ్బులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది కాస్తా పాలస్తీనాలో ఉద్రిక్తతకు దారితీసింది. ఈనేపథ్యంలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని యూదులు, అరబ్బులకు పాలస్తీనా ప్రాంతాన్ని సమంగా విభజించే ప్రతిపాదన చేసింది. ఇరువర్గాలకూ ముఖ్యమైన పవిత్ర జెరుసలెం ప్రాంతాన్ని అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ కింద ఉంచాలని చెప్పింది. యూదులు అంగీకరించినా అరబ్బులు వ్యతిరేకించడంతో ఐరాస ప్రతిపాదన అమలు కాలేదు. యూదులు, అరబ్బుల మధ్య ఉద్రిక్తతలు పెరగడం, పరిస్థితి చేజారిందని భావించిన బ్రిటన్ పాలకులు పాలస్తీనా నుంచి బయటకు వచ్చారు. 1948లో పాలస్తీనా నుంచి బ్రిటన్ వెళ్లిపోయింది. దీనిని అవకాశంగా మలచుకున్న యూదులు ఇశ్రాయేల్ దేశాన్ని స్థాపించుకున్నారు. యూదులతో జరిగిన పోరాటంలో అరబ్బులు నిలవలేక తమ ఇండ్లూ, వాకిళ్లను వదిలేసి పారిపోయారు. అరబ్బులకు మద్దతుగా పొరుగు దేశాలు జోర్డాన్, ఈజిప్ట్ యుద్ధం చేసినా పెద్దగా ఉపయోగం లేకుండాపోయింది. పాలస్తీనాలోని మెజారిటీ భూభాగాన్ని సొంతం చేసుకున్న యూదులు ఇశ్రాయేల్ దేశాన్ని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు. పాలస్తీనాలో ఇటు జోర్డాన్ కొంత భూభాగాన్ని, అటు ఈజిప్టు మరికొంత భూభాగాన్ని ఆక్రమించాయి. జోర్డాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాన్ని వెస్ట్‌బ్యాంక్ అని, ఈజిప్టు స్వాధీనం చేసుకున్న ప్రాంతాన్ని గాజా స్ట్రిప్ అని నామకరణం చేశారు. ఈ ప్రాంతాల్లో అరబ్బులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. జెరూసలెం ప్రాంతాన్ని పశ్చిమం వైపు ఇశ్రాయేల్ దళాలు, తూర్పువైపు జోర్డానియన్ దళాలు పంచుకున్నాయి. తమ భూభాగం కోసం అరబ్బులు తరచుగా ఇశ్రాయేల్‌తో పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాటంలో నుంచి హమాస్ మిలిటెంట్లు పుట్టుకొచ్చారు. 1967లో జరిగిన యుద్ధంలో అరబ్బులు తీవ్రంగా నష్టపోయారు. వెస్ట్‌బ్యాంక్, గాజాస్ట్రిప్ ప్రాంతాలు కూడా ఇశ్రాయేల్ ఆధీనంలోకి వచ్చేశాయి.

2005లో గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయేల్ బయటకు వచ్చేసింది. అప్పటి నుంచి గాజా స్ట్రిప్ పాలన వ్యవహారాలను హమాస్ పర్యవేక్షిస్తోంది. అయితే, వెస్ట్‌బ్యాంక్ మాత్రం ఇప్పటికీ ఇజ్రాయేల్ అధీనంలోనే ఉంది. 1967యుద్ధంలో ఆరు అరబ్బు దేశాలు ఒకవైపు అమెరికా సాయంతో ఇజ్రాయేల్ వేరొక వైపు యుద్ధం జరిపి 6 రోజుల్లో ఇజ్రాయేల్ విజయం సాధించింది. అప్పటి నుండి ఇజ్రాయేల్ తమ సాయుధ బలగాలను ఉపయోగించి అప్రతిహతంగా వెస్ట్‌బ్యాంక్, గాజాలను తమ స్వాధీనంలోకి తెచ్చుకుంది. అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాల మేరకు, ఇవన్నీ కూడా ఆక్రమిత ప్రాంతాలుగా గుర్తించడం జరిగింది. 2022లో ఇజ్రాయేల్‌లో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో మితవాద ప్రభుత్వం ఏర్పడడంతో పాలస్తీనియన్ల అణచివేత మరింత ఉధృతమైంది. సెటిలర్ల మూకలు, మితవాద ముఠాలు పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండి గెంటివేయడం, గ్రామాల నుండి పారద్రోలడం, ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా చంపేస్తూ పాలస్తీనియన్ల జీవితాలను ఈ అతిజాతీయవాద ప్రభుత్వం దుర్భరం చేసింది. ముస్లిం ప్రపం చానికి మూడో అతిపవిత్ర ప్రదేశమైన ఆల్ అక్సా మసీదు ఆవరణలో తీవ్రవాదులైన యూదుల అల్లరిమూకలు, భద్రతా బలగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. మసీదులోకి ప్రవేశించి, అక్కడ ప్రార్థనలు చేసుకుంటున్న వారిపై దాడులు చేశారని పాలస్తీయన్ల వాదన. గాజాస్ట్రిప్‌కు సంబంధించినంత వరకు చూసినట్లైతే, 2005లో ఇజ్రాయేల్ తమ సైనిక బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత, గాజా ప్రాంతం మొత్తంగా ఆంక్షలను విధించింది. ఈ గాజా ప్రాంతంలో దాదాపు 23 లక్షల మంది జీవిస్తున్నారు. గత 16 ఏళ్లుగా, గాజాప్రాంతం దాయాదాక్షిణ్యాలు లేని ఆంక్షలను, దిగ్బంధనాలను ఎదుర్కొంటోంది. ఒకరకంగా బహిరంగ జైలుగా మారింది. ఇదేకాలంలో, ఆంక్షలను, దిగ్బంధనాలను ప్రతిఘటించే ప్రయత్నాలు జరిగినపుడు వైమానిక బాంబు దాడులతో విరుచుకుపడిన సందర్భాలు అనేకం వున్నాయి. ఈ అణచివేతపై తిరుగుబాటు చేయడానికి సిద్ధమైన హమాస్ అందరినీ సమీకరి స్తూ, సంఘటితపరుస్తూ అనూహ్యామైనరీతిలో అక్టోబరు 7వ తేదీన అనేక మార్గాలలో సరిహద్దులను దాటుకుని ఇజ్రాయేల్ గ్రామాలపై, పట్టణాలపై విస్మయపరిచే రీతిలో మెరుపు దాడి చేసి అడ్డం వచ్చినవారిని హతమార్చి, అనేకమందిని బందీలుగా తీసుకుని హమాస్ భీతావహం సృష్టించింది. ఇజ్రాయేల్ ఆక్రమణ, పాలస్తీనా ప్రజల ప్రతిఘటన చరిత్రలో ఇది కొత్త అధ్యాయానికి తెరలేచింది. దాడి జరిగిన తరువాత మిగిలిన దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. పిల్లలమీద, వృద్ధుల మీద జరిగిన ఈ మారణకాండ ఏమాత్రం క్షమార్హం కాదు. ఈ విషయంలో ఇజ్రాయేల్ సమాజం తీవ్రమైన దిగ్భ్రాంతికి వేదనకు గురికావడం సహజం. కోపంతో ఆవేశంతో ఊగిపోవడమూ సహజమే. నాలుగుతరాలుగా సొంతభూ భాగంలో పరాయివారుగా ఉంటూ, ఆంక్షలు, నిర్బంధాల మధ్య కనీసం జీవించేహక్కుకు కూడా నోచుకోని స్థితిలో సామాన్యులు సైతం హమాస్ వంటి మిలిటెంట్ సంస్థలపైన ఆకర్షితులై ప్రజలు కూడా ఉగ్రవాద భావాలు కలిగిన హమాస్ ప్రభుత్వాన్ని అందలం ఎక్కించారు. ఇజ్రాయేల్‌పై హమాస్ చేసిన దాడి ఒక్కసారిగా చేసింది కాదు. ఏడున్నర దశాబ్దాల కాలంలో అనేక పర్యాయాలు పాలస్తీనా ఇజ్రాయేల్ మధ్య దాడులు ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకటి కాదు రెండు కాదు 56 ఏళ్లుగా పాలస్తీనీయులు అణచివేతకు గురవుతున్నారు. సెటిల్ మెంట్లు, హింసాత్మక చర్యల కారణంగా వారు తమ భూమిని కోల్పోయారు. వారి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. ఇళ్లను కోల్పోయి నిరాశ్రాయులయ్యారు. తమ సమస్యకు రాజకీయ పరిష్కారం లభిస్తుందనే ఆశ వారిలో అడుగంటిపోయింది. ఇటువంటి సమయంలో ఇజ్రాయేల్‌పై హమాస్ దాడి ఒక్క సారిగా జరిగింది కాదని పాలస్తీనా ప్రజలు 56ఏళ్లుగా దురాక్రమణలను ఎదుర్కొంటున్నారని, అలా అని హమాస్ దాడులను ఏవిధంగానూ సమర్థించలేమని సాక్షాత్తు ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఈ మారణహోమానికి పూర్తి బాధ్యత అమెరికా, రష్యాలదే. ఈ రెండు దేశాలు దశాబ్దాలుగా తమ మధ్య ఉన్న వైరాన్ని ఆసరాగా చేసుకుని అమీతుమీ తేల్చుకోవడానికి పశ్చిమాసియాను కార్యక్షేత్రంగా ఎంచుకున్నాయి. పశ్చిమాసియాలో అగ్గి రగిలించడం ఈ రెండు దేశాలకు కొత్త కాదు. ఇప్పుడు మరో రూపంలో ఇవి దూకుడుపెం చాయి.



ఇజ్రాయేల్, పాలస్తీనాల మధ్య శాంతి కోసం ప్రపంచ దేశాలు సాగిస్తున్న కృషిని దెబ్బతీయడానికి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు అమెరికా జోక్యం చేసుకోవడం వల్లనే పరిస్థితి క్షీణించిందని చెప్పవచ్చు. ప్రపంచంలో ఏమూల ఘర్షణలు జరిగినా, అస్మదీయులే విజేతలు కావాలనీ, తమ ఆధిపత్యం కొనసాగాలని అమెరికా కోరుకుంటుండటం వల్లనే ఇలాంటి ఘర్షణలు మితిమీరుతున్నాయని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

**ఎవరిది తప్పు:** హమాస్ ఎటువంటి ప్రకటనా సూచనా లేకుండా, సాధారణ ఇజ్రాయేల్ మిలిటరీపైనే కాకుండా ఇజ్రాయేల్ ప్రజానీకంపై ఆకస్మిక దాడు చేయటం అన్నది నిప్పును రాజేయడమే తప్ప పరిష్కారాన్ని సాధ్యం చేసే చర్య మాత్రం కానేకాదు. అది కేవలం ఆవేశపరమైన ఉగ్రచర్యే. ఇక ఆ తర్వాత ఇజ్రాయేల్ గాజాలో చేపట్టిన దాడులు కూడా అమానవీయంగానే ఉన్నాయి. గాజాస్ట్రిప్‌కు నీటిని, విద్యుత్తును, అన్నింటినీ కట్ చేసి సాధారణ ప్రజానీకాన్ని కూడా దారుణంగా హింసిస్తున్నది. ఇజ్రాయేల్ ప్రభుత్వం హమాస్‌పై చేసే దాడులు కూడా ఉగ్రవాదాన్ని తలపించేలా ఉన్నాయి. సామాన్య పౌరులను హత్య చేయడం ఉగ్రవాదం అయితే హమాస్‌తో పాటు ఇజ్రాయేల్ కూడా ఉగ్రవాదం అనుసరిస్తున్న దేశంగానే పరిగణించాలి. ఎందుకంటే నేడు హమాస్‌పై ఇజ్రాయేల్‌పై ప్రతి దాడులు చేస్తున్న తరుణంలో ఎంతోమంది గాజా పౌరులు చనిపోతున్నారు. హమాస్ చేసింది నిస్సందేహంగా ఉగ్రవాద చర్య దానిలో ఎటువంటి సందేహం లేదు.

దానికి అది తగిన మూల్యం చెల్లించాల్సిందే. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించవలసిన బాధ్యత అందరిదీ. అదేసమయంలో బాధ్యతగల ఇశ్రాయేల్ ప్రభుత్వానికి శాంతిని నెలకొల్పవలసిన బాధ్యత మరింతగా ఉందని గ్రహించాలి. గాజాలో పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐరాస సిబ్బంది ఇప్పటి వరకూ 35 మంది వరకు మరణించారని ఐరాస ప్రకటించింది. ఈ సమస్య పరిష్కారం విషయంలో ఇశ్రాయేల్ పాలస్తీనాల మధ్య యుద్ధాన్ని నివారించి శాంతి వాతావరణం సృష్టించడానికి ఐక్యరాజ్యసమితి గతంలో అనేక తీర్మాణాలు ప్రతిపాదనలు చేసింది. వాటిలో అన్నీ ఉల్లంఘనలకు గురిఅయ్యాయి అని చెప్పవచ్చు.

## ఐరాస తీర్మానాల ఉల్లంఘన

'మొత్తంగా గాని, పాక్షికంగా గాని ఒక జాతి, లేదా తెగ లేదా మత సమూహాన్ని నిర్మూలించడానికి చేపట్టే చర్యలను జాతినిర్మూలనగా పరిగణించాలి' అని 1948 జెనీవా సదస్సులో ఐరాస తీర్మానించింది. అయితే సామ్రాజ్యవాద దేశాలు మాత్రం ముందుగా హమాస్ అనే ఉగ్రవాద సంస్థ ఇశ్రాయేల్ మీద దుర్మార్గంగా దాడి చేసిందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇశ్రాయేల్ ఆత్మరక్షణ హక్కుగా గాజాపై దాడి చేయడం సమర్థనీయమే అని చెబుతున్నాయి. ప్రస్తుతం గాజాలో సాగుతున్నది ఆ ఐరాస తీర్మానానికి సరిగ్గా సరిపోతుంది. అయితే ఈ దారుణాన్ని సామ్రాజ్యవాద శక్తులు సమర్థిస్తున్నాయి. హమాస్ అనేది ఒక ఉగ్రవాద సంస్థ అని. అది ఇశ్రాయేల్ మీద దుర్మార్గంగా దాడికి తెగబడిందనీ, భవిష్యత్తులో కూడా హమాస్ నుండి దాడుల ముప్పు ఇశ్రాయేల్‌కు ఉందని, ఉగ్రవాద దాడుల నుండి ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇశ్రాయేల్‌కు ఉందని సమర్థిస్తున్నాయి.

## ద్విరాజ్య పరిష్కారం

1917 నవంబరు 29న 33 దేశాల మద్దతుతో ఐరాస తీర్మానం ఆమోదం పొందింది. ఇండియా సహా 13 దేశాలు వ్యతిరేకంగా, 10దేశాలు తటస్థంగా ఓటింగ్ చేశాయి. ఒక్క పాలస్తీనా దేశాన్ని 'ద్విరాజ్య పరిష్కారం' పేరిట రెండు దేశాలుగా విడగొట్టే తీర్మానమది. అయితే అది నేటికీ కూడా అమలు కాలేదు.

**1967 యుద్ధం:** ఆరురోజుల యుద్ధం విరమణ తర్వాత 1967లో భద్రతా సమితిలో 242వ తీర్మానం ఏకగ్రీవ ఆమోదం పొందింది. దాని ప్రకారం పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయెల్ దురాక్రమణ సేనలు వెంటనే వెనక్కి వెళ్లాలి. నేటికి కూడా అది అమలు కాలేదు.

**- కాల్పుల విరమణ తీర్మాణం 1973**

యుద్ధం ముగిశాక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆ





ఇజ్రాయేల్ అధ్యక్షుడు నెతన్యాహు, పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్

ప్రకారం 1973 అక్టోబర్‌లో భద్రతా సమితి 338వ తీర్మానాన్ని ఆమోదించింది. ఐదు శాశ్వత సభ్యత్వ దేశాలు సహా 14 దేశాలు దీనిని ఆమోదించాయి. అయినా ఇజ్రాయెల్ దానిని అమలు చేయలేదు.

**- 2002 తీర్మానం**

ఇరుపక్షాలను యుద్ధ విరమణ కోరుతూ 2002లో 1397వ తీర్మానాన్ని 14దేశాలు ఆమోదించాయి. అయినా, ఇజ్రాయెల్ అమలు చేయలేదు.

- 1991 మాడ్రిడ్ సభ, 1993 ఓస్లో ఒడంబడిక సూత్రాల్ని ఇజ్రాయెల్ పాటించలేదు. జెనీవా స్ఫూర్తికి విరుద్ధంగా వెళ్లింది.

**- 2008లో ద్విరాజ్య తీర్మానం**

భద్రతా సమితి ద్విరాజ్య తీర్మానం అమలును కోరుతూ 2008లో మరో తీర్మానాన్ని ఆమోదించింది. ఇజ్రాయెల్ అమలు చేయడం లేదు. అమెరికా, పశ్చిమ దేశాలు పైతీర్మానాలకు అనుకూలంగా ఓటింగ్ చేస్తుంటాయి. వాటిని లెక్క చేయని ఇజ్రాయెల్‌పై మాత్రం ఒత్తిడి తీసుకురావు. దాంతో దౌత్యబంధం తెంచుకోవు.

1947లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ద్విరాజ్య పరిష్కార తీర్మానం చేసింది. యూదులు అమెరికా కూడా ఈ ప్రతిపాదనను సమ్మతించాయి. కానీ అరబ్బు దేశాలు ఆనాడు దీనిని వ్యతిరేకించి మాకు పాలస్తీనా ఏకరాజ్యం కావాలని డిమాండ్ చేశాయి. కాలగమనంలో నేటి పరిస్థితులు గతకాలపు ప్రతిపాదనలకు భిన్నంగా మారిపోయాయి. ఆనాడు ద్విరాజ్య ప్రతిపాదనను అంగీకరించిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఏకరాజ్య విధానమే మా లక్ష్యం అంటూ ఉండగా పాలస్తీనా మాత్రం ద్విరాజ్య విధానానికి మొగ్గు చూపుతూ ఉంది. ఫలితంగా రెండు దేశాల మధ్య మరలా ప్రతిష్టంభన ఏర్పడింది. ఈనేపథ్యంలో, ఇటువంటి పరిస్థితుల్లో విసిగి వేసారితే ప్రతిఘటన అనివార్యమౌతుంది. అదే ఇజ్రాయెల్‌పై హమాస్ ప్రత్యక్ష దాడికి కారణం అయ్యింది.

## ఆత్మరక్షణ హక్కు

గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న ప్రతిదాడిని అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, తాజాగా చైనా, అందరూ ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కును పోటీలు పడి మరీ గుర్తించారు.

ఆత్మరక్షణ విషయంలో ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కును ఎవరూ కాదనరు. ఆత్మరక్షణ హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పుడు, తమ దేశంలో తాము పరాయివాళ్లుగా మిగిలి ఆక్రమణదారుల చేతిలో అణగారిపోతున్న మాకు ప్రతిఘటించే హక్కు ఉండదా అని పాలస్థీనీయులు ప్రశ్నిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉన్నట్లే గాజాకు కూడా ఆత్మరక్షణ హక్కు ఉంటుంది అనే విషయాన్ని విస్మరిస్తున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల వలన ఇక్కడ పౌరులు, పసిబిడ్డలు చనిపోతున్నారు, అనేకమంది క్షతగాత్రులు అవుతున్నారు. ప్రజలను నిర్బంధంలో ఉంచడం, ప్రాథమిక అవసరాలు కూడా తీరకుండా చేయడం అనేది 'సామూహిక శిక్ష' కిందకు వస్తుంది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఇది నేరం. ప్రస్తుతం ఇజ్రాయెల్ జరుపుతున్న బాంబుదాడుల్లో విచక్షణ అనేది ఏదీ లేదన్నది సుస్పష్టం. దీనిని ఇజ్రాయెల్ ఉగ్రవాద దాడులుగా ఎందుకు అనలేం. ముందుగా హమాస్ దాడి చేసింది కనుక ఇజ్రాయెల్ చేసిన ప్రతిదాడిని ఆత్మరక్షణ హక్కుగా వర్ణిస్తున్నవాళ్లు ఇన్ని దశాబ్దాల పాటు పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించుకుంటూ వాళ్లను వారి భూభాగంలోనే పరాయి వాళ్లుగా బతుకీడుస్తూ పోరాటాలు చేస్తున్న దానిలో భాగంగానే అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై దాడి జరిగింది అని పాలస్తీయన్ల వాదనను కూడా కొట్టిపడేయలేం. మా ప్రార్థనా మందిరంలోనికి ఇజ్రాయెల్ సాయుధ బలగాలు పంపినపుడు నోరెత్తని సామ్రాజ్యవాద దేశాలు ఈరోజు గాజాలో మమ్మల్ని పూర్తిగా నిర్మూలించాలని అందుకు అవసరమైన సాయుధ సంపత్తిని అందిస్తాం అని మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని పాలస్థనీయుల వాదన.

ఒక దేశంలో ఉగ్రవాదులు దాక్కొని వున్నారు అనే సాకుతో ఆ దేశంలోని ప్రజానీకాన్ని తుద ముట్టించే హక్కు ఏ దేశానికైనా ఉందని అంతర్జాతీయంగా ఏ చట్టమూ ఒప్పుకోదు.

అయితే మరోకపక్క హమాస్ కూడా అమాయక ప్రజలను రక్షణ కవచంగా ఉపయోగించుకుని మారణహోమానికి కారణమై నిలిచింది.

## యుద్ధ నేరం

ఏ కొద్దిమందో నేరం చేసినందుకు మొత్తం ప్రజానీకాన్ని, వారు వ్యక్తిగతంగా ఏ నేరమూ చేయకపోయినా, ఉమ్మడిగా శిక్షించడం యుద్ధ నేరంగా పరిగణించబడుతుందని ఐరాస జెనీవా సదస్సులో మరో తీర్మానం చేసింది. అయితే ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయంలో అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తున్నాం అని చెబుతుంది. అందువల్లనే గాజాలో ప్రజలను ఉమ్మడిగా శిక్షించకుండా అక్కడి పౌరులను గాజాను విడిచి వెళ్లేందుకు అవకాశం కల్పించాం అని చెబుతూ ఉంది. మా లక్ష్యం కేవలం ఉగ్రవాద సంస్థ హమాస్‌ను తుదముట్టించడమే అని ఇజ్రాయెల్ చెప్పుకొస్తుంది. కానీ ఒక పక్క బాంబుల మోతతో ఉన్న నేపథ్యం లో దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్న ప్రజలు దాడులకు మరణిస్తున్నవాళ్లు అనేకులు. కానీ గాజాలో పౌరులు ఎవరు హమాస్ ఉగ్రవాదులు ఎవరు అని తెలియాలి అంటే చాలా కష్టమైన ప్రక్రియ. ఎందుకంటే గాజా



ప్రపంచం లోనే అత్యధిక జనసాంద్రత కలిగిన దేశం. ఇక్కడ సాధారణ పౌరులు ఉగ్రవాదులు వేరు వేరుగా గుర్తించి తుదముట్టించడం సులభతరం కాదు. ఇక్కడ నుండి సాధారణ పౌరులు బయటకు వెళ్లిపోవాలి అని ఇజ్రాయెల్ వాదన సరైనదే. అయిదే దానికి యుద్ధ విరామం ప్రకటించి సాధారణ పౌరులు తరలిపోవడానికి వీలు కల్పించాలి. అయితే ఇక్కడ సాధారణ పౌరులు ఎవరు? హమాస్ ఉగ్రవాదులు ఎవరు అనేది ఏ విధంగా గుర్తిస్తారు.

హమాస్ అనేది గాజాలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం. అలా అని హమాస్ ఉగ్రవాద ధోరణులతో దాడులతోనే సమస్య పరిష్కారం అవుతుంది అనుకోవడం కూడా సరైనది కాదు. సాధారణ పౌరులు బయటకు పోవడానికి అవకాశం కల్పించాం అని ప్రకటన చేసి చేతులు దులుపుకోవడం అంతకన్నా సరికాదు. ఎందుకంటే గాజాలో ప్రవేశం నిష్క్రమణ అంతా ఇజ్రాయెల్ చేతుల్లో ఉంది. అందుకే గాజాను ఓపెన్ ఎయిర్ జైల్ అంటారు. గాజా నుండి బయటకు వెళ్లడానికి ఒకే ఒక్క మార్గం ఉంది అదే ఈజిప్టు. అది కూడా ఇజ్రాయెల్ బాంబు దాడులతో ధ్వంసం అయ్యింది. ఒకవేళ ఆ మార్గం గుండా వెళ్లడానికి సిద్ధపడినా ఈజిప్టు వీరిని శరణార్థులుగా అంగీకరించే స్థితిలో లేదు. ఇప్పుడు మేం ఇచ్చిన సమయం అయిపోయింది కాబట్టి ఇకపై భూతల దాడులు కొనసాగిస్తాం అని ఇజ్రాయెల్ చెప్పడం ఎంతవరకు మానవత్వం అనిపించుకుంటుంది. ప్రజలకు నీరు, విద్యుత్తు, ఆహారం అందకుండా నిరోధించడమే యుద్ధ నేరంగా అంతర్జాతీయ చట్టాలు పరిగణిస్తున్నాయి. గాజాలో ఇంధనం, ఆహారం, విద్యుత్ సరఫరాలు ఆపివేసి గాజాను మొత్తంగా దిగ్బంధించాల్సిందిగా ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గలాంట్ ఆదేశించారు. దీని ఫలితంగా అక్కడ చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. నీరు, ఆహారం లేదు. ఇజ్రాయెల్ చేసిన గాజాపై ఈ దిగ్బంధాన్ని సామూహిక శిక్షగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్యానించారు. ఇది అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధం నేరమేనన్నారు. అంతేకాదు, ఆచరించడానికి సాధ్యం కాని ఉత్తర్వులు జారీ చేసి ఆ గడువులోపల ఖాళీ చేయాల్సిందేనని ఇజ్రాయెల్ ఒత్తిడి చేయడం యుద్ధ నేరమేనని ఐరాస ప్రకటించింది. అయితే ఈ విషయంలో సమస్యను పరిష్కరించవలసిన ఐరాస మాత్రం ఇప్పుడు చేష్టలుడిగి నిస్సహాయంగా ఉండిపోయింది. దీనికి భద్రతా మండలిని పని చేయనివ్వకుండా సామ్రాజ్యవాదులు అడ్డుకోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

## సమాచార యుద్ధం

యుద్ధ భూమిలోనే కాదు, సమాచార యుద్ధంలోకూడా తమదే పైచేయి అనిపించుకోవాలని ఇజ్రాయెల్ పావులు కదుపుతోంది. యుద్ధానికి సంబంధించి మీడియా ఇచ్చే వార్తలు యుద్ధంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని అనుభవ పూర్వకంగా ఇజ్రాయెల్ గ్రహించింది. ప్రస్తుత సమయంలో ఇజ్రాయెల్ ఏకంగా విదేశీ మీడియాపై తాత్కాలిక నిషేధం కూడా విధించింది. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా హమాస్ ఇజ్రాయెల్‌పై చేసిన దాష్టీకాన్ని వీడియోల ద్వారా ప్రపంచానికి తెలియచెప్పే ప్రయత్నాలు ఆరంభించింది. మీడియా తప్పుడు సమాచారం వల్లనే గాజాలో ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దళాలు దాడులు జరిపి

మారణ హోమం జరిపాయనే ప్రచారం ఎక్కువ జరిగిందని వాస్తవంగా హమాస్ దళాలు మిస్ ఫైర్ కావడం వల్లనే అక్కడ హాస్పిటల్‌పై ఘోరం జరిగింది అని ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి అమెరికా ప్రభుత్వం కూడా వత్తాసు పలకడం మనం గమనించవలసిన విషయం. సోషల్ మీడియా ద్వారా యుద్ధానికి మేం కారణం కాదు అనే విషయాన్ని ప్రపంచానికి తెలియచేసే ప్రయత్నం ఇజ్రాయెల్ చేపట్టింది.

**భూతల దాడులు ఆరంభం**

భూతల దాడులను కూడా అమెరికా ఇంతవరకు ఆపుతూ వచ్చింది. దీనికి కారణం గాజాలో సామాన్య పౌరులు దాడులకు ప్రాణాలు కోల్పోతారు అనే ప్రేమ మాత్రం కాదు. హమాస్ ఇజ్రాయెల్ పై దాడులు చేసి ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా తీసుకుపోయింది. ఇప్పుడు తక్షణ కర్తవ్యం బందీలుగా ఉన్నవారిని విడిపించిన పిదప గాజాపై పూర్తి స్థాయిలో దాడులు చేసి నేలమట్టం చేయాలని అమెరికా ఆకాంక్ష. ఇప్పుడు హమాస్ మాత్రం రోజుకు ఒకరు లేదా ఇద్దరి బందీలను విడుదల చేస్తూ ఉంది. పైగా ఇప్పటికి మాకు బందీగా ఉన్నవారిలో కొందరు ఇజ్రాయెల్ దాడులలోనే మరణించారు అని హమాస్ ప్రకటించింది. ఇవన్నీ పోను దాదాపు 200 మంది పైబడి ఉన్న బందీలు విడుదలకు చాలా సమయం పడుతుంది. అంతవరకూ వేచి వుంటే పరిస్థితులు ప్రతికూలంగా మారవచ్చు అనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ బంకర్లు ఉండే ప్రదేశాలను గుర్తించి లక్ష్యం మేరకు ఆ ప్రదేశాల పైనే కచ్చితత్వంగా దాడి చేసే ఐరన్ స్టింగ్ అనే కొత్త సాంకేతికతను కూడా సిద్ధం చేసింది. ఉత్తర ప్రాంతంలో భూతల దాడులు ఆరంభం చేసింది.

**గాజా సమాధి కానుందా?**

గాజా స్ట్రిప్‌కు యుద్ధం కొత్త ఏమీ కాదు. గతంలో నాలుగు యుద్ధాలు జరిగినా తట్టుకుని నిలబడింది. ఈసారి జరగబోయే అయిదవ యుద్ధం నుండి బతికి బట్ట కట్టడం సాధ్యం కాదని కొందరి అభిప్రాయం. దీనికితోడు ఇజ్రాయెల్ చేస్తున్న భీకర యుద్ధం, ఇస్తున్న ప్రకటనలు గాజా ఇక పరిసమాప్తి కానుంది అనే ప్రకటన నిజం కానుంది అనే భీతి కూడా ప్రపంచం ముందు ఉంది. 2014 యుద్ధంలో గాజా తీవ్రంగా నష్టపోయినప్పటికీ ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కోలుకుంటున్నది. కానీ ఇప్పుడు యుద్ధం జరుగుతున్న తీరును చూస్తే గాజా తిరిగి కోలుకుంటుందనే నమ్మకం కోల్పోయింది. ప్రస్తుతం హమాస్ దాడి వలన ఇజ్రాయెల్‌లో ఏర్పడిన పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో హమాస్ వైపు దాడులు లేకుండా ఉండాలి అంటే దానిని పూర్తిగా శిథిలం చేయాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యంగా ఈసారి గాజాలో గల సొరంగ మార్గాలను కూడా ధ్వంసం చేసి గాజాను నేలమట్టం చేయాలని ఇజ్రాయెల్ పట్టుదలతో ఉంది. ఉత్తర గాజాల భూతల దాడులు ఆరంభం చేసింది. అందుకే గాజాను ఈసారి భూమ్మీద అతి పెద్ద సమాధిగా చేయడమే మా ప్రధాన లక్ష్యం అంటూ ఇజ్రాయెల్ ప్రకటన చేయడం బట్టి చూస్తూ వుంటే భవిష్యత్‌లో గాజా ఓ చరిత్రగా నిలిచిపోతుందని అనిపిస్తుంది.



యూరోపియన్ యూనియన్ స్పందన హమాస్.. ఇజ్రాయెల్ మధ్య జరిగే యుద్ధానికి విరామం ప్రకటించాలని యూరోపియన్ యూనియన్ పిలుపు ఇచ్చింది. ఈ యుద్ధం వలన గాజా రక్తసిక్తం అవుతూ ఉందని, దాడుల్లో అమాయకులు బలవుతున్నారని ఈయూ పేర్కొంది. అయితే ఈయూ ప్రతిపాదనను అమెరికా నిర్ద్వందంగా ఖండించింది.

**భారత్ వైఖరి**

కొన్ని దేశాలు పాలస్తీనాకు మద్దతు ఇస్తే ఇంకొన్ని ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నాయి. ఈ అంశంలో ఇండియాలో తన మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు సంఘీభావం ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు తాము అండగా ఉంటామని తెలిపింది. అయితే ఈ విషయంలో భారత్ ఎలాంటి ప్రత్యక్ష పాత్ర పోషించడం లేదు. ఇదే సమయంలో యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోతున్న పాలస్తీనాకు మానవతా సాయం ప్రకటించింది. ప్రధాని మోడీ, పాలస్తీనియన్ అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనా వాసులకు మోడీ సంతాపం ప్రకటించారు. ఈ క్లిష్ట సమయంలో పాలస్తీనాలోని యుద్ధ ప్రభావిత ప్రాంతంలో అవసరమైన సామగ్రిని భారత్ పంపించింది.

**ముగింపు**

విచారించదగ్గ విషయం ఏమిటంటే ఈ యుద్ధం నిలుపుదల చేయడానికి దౌత్య పరంగా తటస్థంగా వ్యవహరించి సమస్యకు పరిష్కారం చూపే ఒక్కటి అంటే ఒక్క దేశం కానరావడం లేదు. పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌కు అండగా అరబ్బు దేశాలు హమాస్‌కు అండగా ఈ యుద్ధ వికృత క్రీడను చూడటం గ్రూపులు వారీగా ఎరికి వారు స్వీయ ప్రయోజనాలే పరమావధిగా ఈ యుద్ధానికి మద్దతు తెలపడం శోచనీయం.

అప్పట్లో దౌత్యం ద్వారా రెండు దేశాల మధ్య సమస్యను పరిష్కరించడానికి పాలస్తీనీయులు నుండి యాసర్ అరాఫత్ అంతర్జాతీయ దౌత్యాన్ని ఉపయోగించి ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి కొంత పురోగతి సాధించాడు. అయితే పాలస్తీనాలో ఉండే మత ఛాందసవాదులకు ఇది నచ్చకపోవడంతో ఆరాఫత్ అనుమానాస్పదమైన పరిస్థితుల్లో మృతి చెందాడు. అలాగే గాంధీ పాకిస్థాన్ విభజనను అంగీకరించి గాడ్సే చేతుల్లో చనిపోయాడు. ఇజ్రాయెల్ పాలస్తీనీయులు మధ్య ఒప్పందానికి ముందుకు వచ్చిన అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఒక మూర్ఖుడి చేతిలో కాల్చి చంపబడ్డాడు. ఇలా శాంతి యత్నాలకు ఆటంకం కలుగుతూ వచ్చాయి. మారణాయుధాలు మానవతా సంక్షోభాలను సృష్టిస్తాయే తప్ప సామరస్యాన్ని నెలకొల్పలేవు. అమాయకుల నెత్తుటితో నిత్యం తడిసిముద్దయ్యే నేలలో శాంతికి స్థానముండదు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం ప్రస్తుతం పశ్చిమాసియాను పట్టి కుదిపేస్తున్న యుద్ధోన్మాదమే! పాలస్తీనా జాతీయులైనా, యూదు జాతీయులైనా ప్రజలు ప్రజలే. ఏ ప్రజలైనా ఒకటే. ఏ ప్రజలనైనా వసల వాదంతో ఎన్ని సార్లు అణచివేస్తే అన్ని సార్లు లేస్తారు అన్నది చారిత్రక వాస్తవం.

**(మిగతా 19వ పేజీలో)**



# ఆరోగ్యసిరి మిల్లెట్స్

ఐక్యరాజ్యసమితితో పాటు 'ఆహార, వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్,(ఎఫ్ఏఓ) 2023ను 'అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్) -2023గా ప్రకటించడంలో భారత్ ప్రభుత్వం తీసుకున్న చొరవ ప్రశంసనీయం. మిల్లెట్స్ లేదా చిరుధాన్యాలు, సిరిధాన్యాలు, తృణధాన్యాల వినియోగంతో ఆరోగ్య పరిరక్షణతో పాటు అధిక పోషకాలు సమపాళ్లలలో శరీరానికి అందించబడతాయని ప్రజలకు అవగాహన పరచడానికి 2023 ఏడాదిని ప్రపంచదేశాలు, ముఖ్యంగా భారతదేశం అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. భారత ప్రభుత్వం 2018 ఏడాదిని 'నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ (జాతీయ మిల్లెట్స్ సంవత్సరం)గా పాటించి పలు అవగాహన కార్యక్రమాలతోపాటు వాటి ఉత్పత్తి వినియోగం, పంపిణీ అంశాల్లో అవగాహన కలిపించిన విషయం మనకు తెలుసు. మిల్లెట్స్ పండించడానికి అతితక్కువ సాగునీరు అవసరం అవడమే కాకుండా తక్కువ కాలంలో పంట రైతు చేతుల్లోకి వస్తుంది.

భారత్-గ్లోబల్ హబ్ ఆఫ్ మిల్లెట్స్‌ను ఆహారంగా వాడకానికి ప్రజా ఉద్యమం (పీపుల్స్, మూవ్‌మెంట్) రావాలని, భారతదేశం 'గ్లోబల్ హబ్ ఆఫ్ మిల్లెట్స్'గా సుస్థిరస్థానం పొందిందని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను మనం ఇంకా మరిచిపోలేదు. ఆసియా దేశాల అవసరాలకు 80శాతం, ప్రపంచ దేశాల జనాభా అవసరాలకు 20శాతం మిల్లెట్స్‌ను భారత్ అందిస్తున్నది.

2023-24 ఏడాదిలో మిలెట్స్/ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు భారత ప్రభుత్వం భారీ నిధులను కూడా కేటాయించింది. భారతదేశంలో ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థల ద్వారా మిలెట్స్‌ను పేదలకు తక్కువ ధరకు, ఉచితంగా అందజేస్తున్నది. సుస్థిరాభివృద్ధి, రైతుల సాధికారత, ఆకలిని తరమడం, ప్రతికూల వాతావరణ మార్పుల కట్టడి, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యవసాయ ఆహార వ్యవస్థలను బలోపేతం చేయడంలో మిలెట్స్ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి.



చిరుధాన్యాలతో ప్రజారోగ్య పరిరక్షణ

ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్-2023 నినాదంగా 'ఆరోగ్య చిరుధాన్యాలు, ఆరోగ్యప్రజలు 'హెల్దీమిల్లెట్స్, హెల్దీపీపుల్' అనబడే అంశాన్ని తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణకు మిలెట్స్ ఉపయోగపడడంతో వాటి ఉత్పత్తి, వినియోగం, వాటి విలువను పెంచడం కోసం పలు చర్యలను తీసుకోవడం జరుగుతున్నది. అధిక పోషక విలువలు కలిగిన తృణధాన్యాలను అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రమే అధికంగా వినియోగిస్తున్నారు. ఆరోగ్యవంతులు సిరిధాన్యాలను వాడిన వారు అనారోగ్యాలకు దూరంగా ఉంటారని గమనించాలి. ప్రతిరోజు మన ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా జాగ్రత్తపడాలి.

ముఖ్యమైన మిల్లెట్స్‌లో రాగులు, కొర్రలు, ఎండుకొర్రలు, అరికెలు, సామలు, ఊదలు వంటివి సిరిధాన్యాల వర్గంలోకి వస్తాయని మనకు తెలుసు. సన్నని గడ్డిలాంటి మొక్కల ద్వారా లభించే చిరుధాన్యాల్లో తక్కువ కెలరీలు, అధిక మాంసకృత్తులు/ పీచు పదార్థాలు ఉంటాయి. మిల్లెట్స్ ఆహారంతో జీర్ణశక్తి మెరుగుపడడం, కండరాల పనితీరు పెరగడం, గాయాలు తొందరగా మానడం, మలబద్ధక సమస్య దూరం కావడం, బరువు తగ్గడం, ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపించడం జరుగుతుంది. ఈ ప్రయోజనాలతో పాటు నరాల బలహీనత, కీళ్ల నొప్పులు, మూర్ఛరోగం, మధుమేహం, బిపీ, రక్తహీనత, మలబద్ధకం, కామెర్లు, వీర్యకణాల సమస్యలు, కంటి సమస్యలలాంటి అనారోగ్యాలకు ఔషధాలుగా తృణధాన్యాలు దోహదపడతాయి. గ్లూటిన్ రహిత శాకాహార మిలెట్స్‌లో ఫాస్ఫరస్‌తో పాటు కాల్షియం, ఐరన్, ఖనిజ లవణాలు లాంటి పోషకాలనేకం అధిక పరిమాణంలో ఉంటాయి.

సిరిధాన్యాలు పోషకశక్తి కేంద్రాలు

చిరు ధాన్యాలు ఆరోగ్య హేతువులని అధిక పరిమాణంలో తినరాదు. సేంద్రియ పద్ధతిలో పండించని, పాలిష్ చేయని మిల్లెట్స్‌ను నానబెట్టిన తర్వాత పరిమిత పరిమాణంలో తీసుకోవడం ఉత్తమం. హైపోథెరాయిడిజంతో బాధపడేవారు, సున్నిత జీర్ణక్రియ ఉన్న బలహీనులు చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవద్దు. భారత ప్రభుత్వం మిల్లెట్స్ అమ్మకాలకు జిఎస్‌టీ పన్నులను రద్దు చేయడంతో అన్నివర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. 'పోషకశక్తి కేంద్రం'గా పని చేస్తున్న తృణధాన్యాలను మన ఆహారంలో భాగం చేసుకుంటూ ఆరోగ్య భారత నిర్మాణంలో మన కర్తవ్యాలను నిర్వహిద్దాం.

**- మధుపాళీ**

## ఈవారం కవిత్వం

# రసమాధురి



నీ కాలి గజ్జెల
సవ్వడులు వింటుంటే
సప్తస్వరాలు చెవిన
మృదువుగా సోకినట్లనిపిస్తుంది.
నీ సిగపాయల
మధ్యన మెరిసే సింధూరం చూస్తుంటే
'కడవా చౌత్' నాడు వెలిగే
చల్లని చంద్రుల వెన్నెల
గుర్తుకొస్తుంది.
నీ నుదిటి బొట్టు చూడగనే
కోటాను కోట్ల కాంతులు విరజిమ్మే
సూర్యబింబం గుర్తుకొస్తుంది
నీ పాద స్పర్శ తాకగనే
అరకులోయలో హాయిగా
విహరిస్తున్నట్లనిపిస్తుంది
నీ కురుల పరిమళాల ముందు
మరుమల్లెలు బోసిపోయినట్లు
నీ కాటుక కన్నులు చూస్తుంటే
కలువలు వెలవెలబోయినట్లపిస్తుంది
ఓ.. నా ప్రియ ప్రేయసీ
నారీ రసమాధురి
నా హృదయ క్రాంతిలో
చంద్రకాంతివి నీవు
నీతో ఏడడుగులు నడిచి
నా చూపుడి వేలితో
అరుంధతీ నక్షత్రాన్ని
చూపించిన మధుర క్షణాలు
గుర్తుకొస్తున్నాయి.
'ఓ... నా ప్రియసఖీ
ఇప్పటికీ ఎప్పటికీ'
నాకై వచ్చిన దేవతవి
నను నడిపించిన / నా జ్యోతివి నీవే.
నా ప్రేయసీ నీవే
నా ప్రియురాలు నీవే
నా దానివి నీవే నీవే..

**- కొరుప్రోలు హారనాథ్**

---

# ప్రశ్న ముంగిట్లో ప్రశ్నలా..



జల్లెడ్లా మారిన
బామ్మ ముతక చీర చిరుగుల నుండి
మేఘావృతమైన నింగి
ఎంత ముచ్చటగా కనిపిస్తుందో!
అడుగడుగునా కనిపించే దేశంలోని పేదరికంలా!
దోబూచులాడే రుతుపవనాలను
నింగి మోసుకొస్తుందనే పగటి కలను
నిర్వీర్యం చేస్తూ,
కదిలిపోతున్న మేఘాల వైపు
బామ్మ చేతిలోని పాలబువ్వ కోసం
ఆశగా చూసే చిన్నారిలా,
చూస్తుండు మా అయ్యా
గడ్డం కింద ఊతకర్ర అట్టకుని..
నాలుగు చినుకులు చిలకరించి పోదామని
ధాత్రి వైపు అడుగిడుతున్న మేఘం,
అనాథాశ్రమంలో
ఆసరా కోసం తపించే దంపతుల్లాగ
బీడు వారిన భూములు,
తన కోసం ఎదురు చూస్తుంటే!
నిస్సహాయంగా చూస్తూ, తిరిగి నింగి వైపు
సాగిపోతుంది.
భూమి ఉపరితలంపై ఉష్ణోగ్రతకు తాళలేక.
ప్రకృతిని నిందిస్తూ మనిషి,
మనిషి మూర్ఖత్వంతో ఉనికిని కోల్పోతున్న
ప్రకృతి..
విభిన్న ధ్రువాలుగా మారుతుంటే
రేపటి భవితభవిష్యత్ ఏమౌనో!
సమాధానం లేని ప్రశ్న..
ప్రశ్న ముంగిట్లో ప్రశ్నలా!

**- రాము కోలా**




## అనుభవాల సంఘటనల కవితలు

డా॥గొల్లపెల్లి రాంకిషన్ రచించిన 108 కవితల సంపుటి ఇది. ఈ కవితలలో మానవ సంబంధాల పట్ల అచంచలమైన విశ్వాసం కనిపిస్తుంది. సమాజంలో మనకు నిత్యం అనుభవమయ్యే పలు సంఘటనలు, అనుభవాలను ఈ కవితలు ప్రతిబింబిస్తాయి. 'సామాజిక మాధ్యమాల'పై వ్యాఖ్యానిస్తూ కవి 'ఎడారి బాటసారికి ఎదురైన ఒయాసిస్సు' అంధకార మార్గాన పొడిచిన తొలి ఉషస్సు/ ప్రేమరాహిత్య అరణ్యపథాన అందమైన సరస్సు/ సామాజిక మాధ్యమ వేదిక ఒంటరి మనస్సులకు ఉషస్సు' అంటారు కవి. 'దొంగ బతుకు'ను వర్ణిస్తూ 'చాటుమాటు మనుగడతో పూటపూట గండంతో/ అనుక్షణం దాక్కుంటూ చట్టాలకి చిక్కిన తప్పించుకుంటూ/ పట్టుబడి ఏళ్లకేళ్లు జైళ్లలోని కుళ్లికుళ్లి/ సమాజంలో హీనంగా కొండొక చోదీనంగా/ కుటుంబాలకే/ అవమానపడి సంతానం మూలపడి/ దొంగలదీ ఒక బ్రతుకేనా?' అంటూ ఈసడిస్తారు కవి. ప్రస్తుత సమాజంలో కవిత ప్రాధాన్యాన్ని వివరిస్తూ, 'దేవదేవత సంఘర్షణ సంఘునిది/ ఐతేనం కవన మోహిని కనికరిస్తుంది/ సాహితీహితుల మయెలను/ కృతుల సత్కృతుల సారస్వతోద్భుతాన్ని ధారపోయుటకు' అంటాడు కవి. ఈ కవితలలో లయ ఉంది. చక్కని భావం ఉంది. అందమైన ఆలోచనలున్నాయి. అందరూ చదివి అనువదించగల చక్కని కవితల సంపుటి ఇది.

**(మనోదర్పణం, రచన: డా॥గొల్లపెల్లి రాంకిషన్, వెల: రూ 180, ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలు)**

– నిర్మోహి

# పుస్తక సమీక్ష



## మహిళాలోకానికి స్ఫూర్తిదాయకం

ఆంధ్ర మహిళా సభ కష్టాలలో ఉన్న మహిళలను చేరదీసి శిక్షణయిచ్చి ఉపాధ్యాయినులుగా, నర్సులుగా, వైద్యులుగా, సేవా కార్యకర్తలుగా తీర్చిదిద్దే వటవృక్షంగా సేవాపరంపర కొనసాగిస్తోంది. కుమ్మమూరి (పొత్తూరి) సుబ్బాయమ్మ మహిళోద్ధారకులు శీర్షికన, పూర్వ విద్యార్థినిగా, మహిళాసభతో 40 సంవత్సరాల పరిచయ సాన్నిహిత్యంతో 52మంది సేవాతత్పరుల జీవిత విశేషాలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం. రాణిలక్ష్మి వెంకాయమ్మరావు ప్రప్రథమ అధ్యక్షురాలిగా, దుర్గాబాయ్, డా॥చింతామణి దేశ్‌ముఖ్, జస్టిస్ గంగాధరరావు, సుగుణమణి, డా॥వనజా అయ్యంగార్ ఎందరో సేవాపరాయణులను, సాధ్యమైనంతవరకు ఫొటోలతో రచయిత్రి ప్రచురింపచేసారు. స్వాతంత్ర్యసమరయోధురాలిగా దుర్గాబాయిని భగవత్స్వరూపిణిగా స్మృత్యంజలి ఘటించారు. అధ్యక్షులు, ఉపాధ్యాక్షులు, కార్యదర్శులు, జాబితాలో వారి జీవిత విశేషాలను తేదీలతో పొందుపరిచారు. దయ, ప్రేమ, సానుభూతి వేళ్లుగా ఈ వటవృక్షం అందించిన సేవలు, మహిళాలోకానికి నేటికీ సేవాస్ఫూర్తి అందిస్తున్నాయి. శిశిరంలో పండుటాకులు రాలినా, మరల మరల చివుళ్లు అంకురింప చేస్తూ నిరంతర సేవాపరంపర కొనసాగిస్తున్న ఒక మహాసంస్థ అపూర్వ సేవానిరతిని సాహితీకిరణం గ్రంథస్థం చేయడం అభినందనీయం. **(మహిళోద్ధారకులు, రచన: కుమ్మమూరి (పొత్తూరి) సుబ్బాయమ్మ, సాహితీకిరణం, 11-13-154, అలకాపురి రోడ్ నం.3, హైదరాబాద్-500102)**

– యర్రమిల్లి

## సామాజిక చైతన్యం పూరించిన 'క్రొత్తరాగం'


సుదీర్ఘ కాలం దేశరక్షణ వృత్తిలో అలసిపోయిన దర్భముళ్ల చంద్రశేఖర్..కవిత్వంతో సేదతీరుతూ 'క్రొత్తరాగం' ఆలపిస్తున్నారు. తన చుట్టూ వున్న ప్రకృతి, పరిసరాలు, పరిస్థితులు, ప్రజలను వస్తువులుగా మలచి కవితలుగా కవి తీర్చిదిద్దిన నాలుగవ కవితాసంపుటి యిది. 'రెండు పార్శ్వాలను/ పొదిగి పొదిగి పొట్టి పొడుగు చేసి/ 'పుట్టుకచావు'లను పూరిస్తే/ బతుకు వంతెన!



అవుతుందని జీవితానుభవసారాన్ని దట్టించి కవిత్వం అందిస్తున్నాడు. 'భయాన్ని బెంగల్ని తుడిచేస్తూ/ ధైర్యాన్ని దరిచేరుస్తూ/ మావీధి గూర్ఖా వేస్తున్న విజిల్/ ఈమని వీణానాదంలాగా' వినిపిస్తుందట. ఆనాదంలో కఠిన జీవన సత్యాలను వినిపిస్తాడు కవి. పరువు హత్యలను నిరసిస్తూ ఎన్నికల వాగ్దానాలతో ప్రజలను గొర్రెలను చేస్తున్న రాజకీయ నాయకుల వికృతక్రీడల్ని ఎండగడ్తు, ఎన్నో బంధాల్ని జ్ఞాపకాలను పదిలపరుచుకున్న 'ట్రంకు పెట్టె'ను మనగతాన్ని గుర్తుచేసే "pandora's Box" గా వర్ణిస్తూ, సామాజిక రుగ్మతలను దృశ్యమానం చేస్తు, మానవీయ విలువల్ని గుర్తుచేస్తూ అల్లిన కవితల సమాహారం 'క్రొత్తరాగం'. ఈ సంపుటిలోని కవితలన్నీ 'సిరి కోన సాహితీఅకాడెమీ' వాట్సాప్ సమూహంలో పంచుకున్నవే గావడం గమనార్హం. తన కవిత్వం చదివి పాఠకుడు జాగృతిని పొంది, Awareness స్థితికి చేరుకోవాలని దర్భముళ్ల చంద్రశేఖర్ ఆశయం. **(క్రొత్తరాగం, రచన: డి. చంద్రశేఖర్, వెల: రూ 200, ప్రతులకు: 303, రైతు బజారు ఎదురుగుండా, గోపాలపట్నం, విశాఖపట్నం)**

– రమణ వెలమకన్ని

'అదృశ్యకిరణాల'తో దృశ్యమానమై, 'మానేరు నానీలు', 'ఎనగర్ర', 'గవ్వలు', 'చుక్కపొద్దు'లతో పొద్దుపొడిచి, మానవత్వపు మంచితనపు వర్గమూలాలను' శోధిస్తూ, తడి ఆరుతోన్న బ్రతుకుల గమ్యనిర్దేశనం చేస్తున్నారు జిందం అశోక్. అశోక్



## జీవన మూలాల్ని శోధించిన వర్గమూలాలు

కవితల్లో ఆర్ద్రత ఉంది. ఆవేదన ఉంది. సాటిమనిషిమీద ప్రేమ ఉంది. ఒక 'ప్రొటగొనిస్టు'లా ఆరచేయినుదుటికి ఆనించి సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూస్తూ, తనతో నడుస్తున్న మనందరినీ హెచ్చరించే నాయకత్వం ఉంది. లోకరీతిని, మానవీయతను, మన నిర్లిప్తత, మందకొండితనాన్ని అక్షరాల దివిటీతో చూపుతూ 'పారాహుశార్' అనే ముందుచూపు ఉంది. 'చీకటి పన్నెండు గంటలు మాత్రమే. సూర్యోదయం నిత్యనూతనం, 'మరణించడం అంటే మళ్లీ కొత్తగా జన్మించటమే'/ అన్న ఆశావాదం ఉంది. అధికారపు ముళ్లకంపను ఎత్తి చూపి దారిని సరిచేసే 'రాగోల' అవుతాడు. వారి అవినీతి మంటలను ఆర్పటానికి ఫైరింజన్ అవుతాడు. 'మానవత్వమూలాలు లేకుంటే/ మానవజన్మ మట్టికొట్టుకు పోవాల్సిందే!' అన్న తెలివిడిని పాఠకుల్లో కలిగించే విధానం బాగుంది. ఇరవై ఏళ్లగా సమాజ ప్రయాణాన్ని తనదైన కోణం లోంచి ఆవిష్కరిస్తున్న అశోక్ జిందంకు అభినందనలు. **(వర్గమూలాలు, కవిత్వం, రచన: జిందం అశోక్, వెల: రూ 150, ప్రతులకు: ఇ.నం.8-5-492/5/2, పోచమ్మవాడ, కొత్తిరాంపూర్, కరీంనగర్)**

– కూర చిదంబరం



# చూపులన్నీ అక్షరధామ్‌పైనే!

ఆధ్యాత్మికతను పంచుతూ.. ఆహ్లాదానికి నెలవైన ఆ ఆలయాలెన్నో మనచుట్టూ ఉన్నాయి. దేని అద్భుత కళ దానిదే. అలాంటి వాటిల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది మాత్రం స్వామి నారాయణ్ 'అక్షరధామ్' గురించి. శ్రీకృష్ణడి అంశగా ఆరాధించే స్వామి నారాయణ్ కొలువు దీరిన ఆలయమే 'అక్షరధామ్'. ఆకట్టుకునే నిర్మాణశైలి, అబ్బుర పరిచేకళావైభవంతో అలరారే ఆ దేవాలయాలు దేశవిదేశాల్లో దర్శనమిస్తాయి. అలాంటి వందలాది దేవాలయాల్లో అమెరికా (న్యూజెర్సీ)లోని రాబిన్స్‌విల్లే టౌన్‌షిప్‌లో 182 ఎకరాల్లో నిర్మితమైన స్వామినారాయణ్ అక్షరధామ్ మాత్రం ఎంతో ప్రత్యేకమైంది. అమెరికాలోని అతిపెద్ద హిందూ దేవాలయాల్లో మొదటిదీ, ప్రపంచంలోనే రెండోది అయిన ఆ ఆలయాన్ని రాజస్థానీ సంప్రదాయాలకు అనుగుణంగా చూపుతిప్పుకోనివ్వని అందమైన శిల్పాలతోనూ, భారీ గోపురాలతోనూ, అట్టహాసమైన మండపాలతోనూ కళ్లు చెదిరిపోయేలా తీర్చిదిద్దారు.

గుజరాత్‌కు చెందిన బోచాసన్వాసి అక్షర పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ(బీఏపిఎస్) ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఈ ఆలయ నిర్మాణంలో ఇసుమంతైనా ఉక్కూ ఇనుమూ వాడకుండానే వేలాది సంవత్సరాలపాటు చెక్కు చెదరని విధంగా నిర్మించడం విశేషం. చూపుతిప్పుకోనివ్వని శిల్పకళ బీఏపీఎస్ మనదేశంతోపాటు, కెనడా, యూకే, కెన్యా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో దాదాపు 1400 వందల ఆలయాలను నిర్మించింది. ఈ సంస్థకు గురువుగా ఉన్న ప్రముఖ్‌స్వామి మహారాజ్ రాబిన్స్‌విల్లేలో అతిపెద్ద గుడిని నిర్మించాలని పాతికేళ్ల క్రితమే సంకల్పించారు. 2011లో అది కార్యరూపం దాల్చడంతో ఈ అక్షరధామ్ నిర్మాణానికి పునాదిరాయి పడింది. అక్షరధామ్ ఆలయాలంటేనే పురాతన శిల్పకళకు పెట్టింది పేరు. ఆలయం లోపలా, బయటా ఉన్న రాతిస్తంభాలూ, గోడలపైన చెక్కిన చిత్రాలూ, స్ఫూర్తిదాయక కథలూ భక్తులకు స్వామినారాయణ్ జీవిత చరిత్రనూ సందేశాలనూ వర్ణిస్తుంటాయి. పదివేలకుపైగా శిల్పాలూ, విగ్రహాలూ, భారతీయ సంగీత నృత్యరూపాలతో సహా పురాతన సంస్కృతి ఆ ఆలయంలో అడుగడుగునా ప్రతిబింబిస్తుంది. రాతిని అంత రమణీయంగా చెక్కి చూపుతిప్పుకోనివ్వకుండా తీర్చిదిద్దిన ఈ నిర్మాణంలో సున్నపురాయి పింక్ శాండ్ స్టోన్, పాలరాయి, గ్రానైట్‌లను వినియోగించారు. ఈ రాళ్లను భారత్, బల్గేరియా, తుర్కియే, గ్రీస్, ఇటలీ, చైనాల నుంచి సేకరించారు.



**చెక్కింది రాజస్థాన్‌లో..**

రాబిన్స్‌విల్లే అక్షరధామ్‌ని నిర్మించింది అమెరికాలోనే అయినా చాలావరకూ ఆ పనులు జరిగింది మాత్రం మనదేశంలోనే. రాజస్థానీ చెక్కుళ్లూ..నగిషీలూ అచ్చుగుద్దినట్టు తీసుకురావాలనే ఉద్దేశంలో సేకరించిన రాళ్లను మొదట కంటైనర్ల సాయంతో షిప్పుల్లో ముంబయికీ, తరవాత రాజస్థాన్‌కూ తీసుకెళ్లారు. అక్కడ వందల మంది శిల్పులు ఆ రాళ్లను అందమైన శిల్పాలుగానూ, విడిభాగాలుగానూ,

పలు కళాకృతులుగానూ చెక్కారు. గుడినిర్మాణ ప్లాన్ ప్రకారం శిల్పులు చెక్కిన శిల్పాలకూ, పిల్లలర్లకూ, ఇతర కళాకృతులకూ నంబర్లు వేసి..ఏది ఎక్కడ పెట్టాలో వివరాలను జత చేసి మళ్లీ కంటైనర్లలో అమెరికాకు తీసుకెళ్లేవారు. ఆ వివరాల ఆధారంగా నిపుణులు వాటిని అమర్చి నిర్మించే వారు. దాదాపు ఆలయనిర్మాణం ఆ విధంగానే పూర్తిచేయడం విశేషం. అద్భుత పనితీరుతో ఆకట్టుకునేలా చెక్కిన దేవీదేవతల విగ్రహాలూ గురువుల ప్రతిమలూ, నెమలి తోరణాలూ, ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన డోమ్‌ల వంటివాటితో భూలోక స్వర్గంగా దర్శనమిచ్చే స్వామి నారాయణ్ మందిరం పన్నెండు ఉపాలయాలు, తొమ్మిది శిఖలు, రెండు పెద్ద ఎనిమిది చిన్న గుమ్మటాల (డోమ్‌లు)తో కూడిన భారీ ఆలయ సముదాయం. 42 అడుగుల ఎత్తు, 133 అడుగుల పొడవు, 87 అడుగుల వెడల్పు ఉండే



మహామందిరాన్ని అయితే పూర్తిగా ఇటాలియన్ కరారా మార్బుల్‌తో కట్టారు. దీన్ని చూడగానే వెండి వెలుగుల్లో మెరిసిపోతూ ఆలయం అంతటినీ వెండితోనే నిర్మించారనే భ్రమను కలిగిస్తుంది. లైట్ల వెలుతురులో అయితే గాజు నిర్మాణాన్ని తలపించే ఈ ఆలయ నిర్మాణ పనుల్లో శిల్పులూ, ఇతర






నిపుణులతోపాటు వలంటీర్లు కూడా పాలుపంచుకోవడం విశేషం. దాదాపు 12,500 మంది భక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తలో చేయి వేశారు. పనులు జరుగుతున్న ప్రదేశాలను శుభ్రం చేయడం, శిల్పులూ, ఇతర కార్మికులకు భోజనాలు వడ్డించడం వంటి పనుల్లో భాగస్వాములయ్యారు. ఇలా వేలాది మంది దాదాపు పన్నెండేళ్లపాటు ఎంతో శ్రమించి ఆవిష్కరించిన అందాల అక్షరధామ్ ప్రాంగణంలోనే ఓ జలాశయం ఉంటుంది. మతాచార కార్యక్రమాల నిమిత్తం ఈ జలాశయాన్ని 'బ్రహ్మకుండ్' పేరిట నిర్మించారు. ఆలయం మాదిరే దానికీ ఓ ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దాదాపు మూడొందల నదులనుంచి నీళ్లను తెప్పించి

బ్రహ్మకుండ్‌ను నింపారు. అందుకోసం వేలాదిమంది స్వామి నారాయణ్ భక్తులు దేశవిదేశాలకు వెళ్లి ఈ నీటిని సేకరించారు. ఆ బ్రహ్మకుండ్ పక్కనే బాలుడి రూపంలో ఆధ్యాత్మికతో అలరారే స్వామినారాయణ్ శిల్పం సాక్షాత్కరిస్తుంది. మహామందిరంలో రాధాకృష్ణులూ, సీతారాములూ, శివపార్వతులూ తదితర దేవీ దేవతలెందరో దర్శనమిస్తారు. అలానే పరమ గురువులూ, యోగులూ, స్వామీ





జీల శిల్పాలు కూడా సజీవ శోభతో కనిపిస్తాయి. ఎంతో వైభవోపేతంగా శిల్ప సౌందర్యంతో అలరారే ఈ మందిరం నిర్మాణానికి బీఏపీఎస్ దాదాపు రూ.150 కోట్లు ఖర్చుపెట్టింది. రాబిన్స్‌విల్లే అక్షరధామ్ అణువణువూ అత్యున్నత భారతీయ శిల్పకళకు, హైందవ ఆధ్యాత్మిక సంపదకు ప్రతిరూపమైనది. ❑

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# రెండు వాతలు

సిరిపురంలో రామయ్య అనే వ్యక్తి తన గాడిదపై చింతపండు మూటలు పెట్టుకుని పొరుగున ఉండే గ్రామాలకు పోయి అమ్ముతూ ఉండేవారు. ప్రతిరోజు బరువులు మోయడం బాధ అనిపించిన గాడిద ఎలాగైనా ఈ బాధ తప్పించుకోవాలని ఆలోచన చేసింది. గాడిద ఎప్పటిలా బరువుతో బయలుదేరిన గాడిద



కుంటుతూ నడవసాగింది. అదిచూసిన రామయ్య గాడిదకు కాలు నొప్పిగా ఉందని భావించి, గాడిదను ఇంటిముందు ఉన్న చెట్టుకింద కట్టివేసి చేరువలో నీరు తాగడానికి నీళ్లుపెట్టి, చింతపండు మూటను తన తలపై పెట్టుకుని చేరువలోని గ్రామానికి వెళ్లాడు. వారంలో రెండురోజులు గాడిద ఇలా చేయడంతో విసిగిన రామయ్య గాడిదను సంతకు తీసుకువెళ్లి సోమయ్య అనే వ్యక్తికి అమ్మి తను మరో గాడిదను కొనుగోలు చేసి ఊరుచేరాడు.

బట్టల మూటలు గాడిదపై వేసిన సోమయ్య దాన్ని తోలుకుంటూ చెరువుకు బయలుదేరాడు. రెండురోజులు మోసిన గాడిద, బట్టల మూటల బరువు మోత నుండి తప్పించుకోవడానికి మళ్లీ కుంటసాగింది. ఒకటి, రెండు పర్యాయాలు విశ్రాంతి కలిగించిన సోమయ్య తన గాడిదను వైద్యుడివద్దకు తీసుకెళ్లాడు. గాడిదను పరీక్షించిన వైద్యుడు దీనికి బహుశా వాతనొప్పులై ఉంటాయి అని గాడిద కుంటుతున్న కాలు తొంటిభాగంపైన బలంగా రెండు వాతలు వేసాడు. వాతల బాధకు తట్టుకోలేక గట్టిగా ఓండ్రపెట్టిన గాడిద, రామయ్య నయం కాలునొప్పి అని నటిస్తే విశ్రాంతి కలిగించాడు. ఈ సోమయ్య రాక్షసుడిలా ఉన్నాడు ఏకంగా వాతలే వేయించాడు. యజమానిని మోసగించబోయిన తనకు తగినశాస్తి జరిగిందని, పనిదొంగలకు ఇది తగిన శాస్తి అనుకుని, ముందు జీవితంలో ఎప్పుడైనా తప్పుడు ఆలోచనలు చేస్తే వాతలు గుర్తుకు వచ్చిన గాడిద మరెన్నడు తప్పుగా ప్రవర్తించలేదు.

–డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు

## రంగులు వేయండి



# తెలుగు వెలుగు బాల ఇల్లు మెలుగు



## బాలగేయం

### కోయిల



కోయిల
కూసిందమ్మా
కూసింది
కమ్మగ కోయిల
కూసింది
కొమ్మల్లో దాగి
కూసింది
వీనుల విందు చేసింది
మావి చిగురు మేసింది
మైమరచీ పాడింది
పొద్దుపొద్దునే లేచింది
ముద్దుముద్దుగా
కూసింది
జగతినే
మేలుకొల్పింది
ప్రగతికి హారతి పట్టింది
ప్రభాత గీతి పాడింది
విశ్వశాంతినే కోరింది

**- గుండాల నరేంద్ర బాబు,** తిరుపతి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఎ.నందిత,** ఎమ్మిగనూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. రంగులు ఎలా ఏర్పడతాయి?**



**జవాబు: నందిత!** సూర్యకాంతిలో రకరకాల నిడివిగల విద్యుదయస్కాంత తరంగాలు కలిసి వుంటాయి. వాటిలో మన దృష్టికి కనపడేవి 380 (ఊదారంగు) నుంచి 720 (ఎరుపు రంగు) నానోమీటర్ల నిడివి కలిగినవి మాత్రమే. ఒక సెంటీమీటర్‌కు కోటి నానో మీటర్లు సమానం. 380-720 నానోమీటర్ల నిడివి మధ్యగల తరంగాలు మాత్రమే మన కంటికి కనిపిస్తాయి. తక్కువైనా ఎక్కువైనా మనకు ఆ అయస్కాంత తరంగాలు కనపడవు. అన్ని రంగులు కలిస్తే శ్వేత(తెలుపు) వర్ణమే. అంటే తెల్లని కాంతి ఏర్పడుతుంది. ఆయా వస్తువులు మనకు ఏ రంగులో కనపడుతున్నాయనేది వాటి మీద ఎటువంటి, ఎంతటి నిడివి గల కాంతి తరంగాలు పడుతున్నాయనే దాని మీద ఆధారపడి ఉంటుంది. అంతేకాదు, మన కంటిచూపు సామర్థ్యం మీద కూడా రంగు విచక్షణ ఆధారపడి ఉంటుంది.

**- కె.ప్రణవి,** పాల్వంచ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చీకట్లో మెరిసే స్టిక్కర్స్‌ను ఏవిధంగా తయారు చేస్తారు?**

**జవాబు: ప్రణవి!** రేడియం మూలకణంతో మెరిసే స్టిక్కర్లను తయారు చేస్తారు. ఈ రేడియం 'పిచ్ బ్లెండ్' అనే పదార్థం నుంచి రూపొందుతుంది. అధిక ఎలక్ట్రాన్‌ల కేంద్రక చర్యల కారణంగా రేడియం కాంతి రూపంలో ఎల్లవేళలా కొంతమేర శక్తి విడుదల చేస్తుంటుంది. 'ఎలక్ట్రో టైపింగ్' ప్రక్రియ ద్వారా రేడియం స్టిక్కర్లు ప్రింట్ అవుతాయి. ఈ ప్రింటెడ్ స్టిక్కర్లు మాత్రం రేడియం మాదిరిగా ఎప్పుడూ మెరుస్తుండవు. వాటి మీద కాంతి కిరణాలు ప్రసరించినప్పుడే మెరుస్తాయి.



# సైబర్ భద్రత బాధ్యత మనదే

**ప్రస్తుతం** ఎక్కడ చూసినా ఆన్‌లైన్ దొంగతనాలే మనకు ఎదురవుతున్నాయి. ఇంట్లోనే కాదు, ఆన్‌లైన్‌లోనూ దొంగలు పడతారు. కంటికేమీ కనిపించరు గానీ వ్యక్తిగత సమాచారం కాజేస్తారు. మాయమాటలు చెప్పో, బురిడీ కొట్టించో రహస్య వివరాలు లాగేస్తారు. వీటిని ఉపయోగించుకొని ఉన్నదంతా దోచేయొచ్చు. మన లోపాలు, బలహీనతలను అడ్డుపెట్టుకొని బెదిరించొచ్చు. డబ్బులు వసూలు చేయొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం. అప్పుడు వస్తువులు కొనాలన్నా..ప్రయాణాలకు, సినిమాలకు, వినోదాలకు టికెట్లు పొందాలన్నా బ్యాంకు లావాదేవీలకైనా ఆన్‌లైనే ప్రధాన సాధనంగా మారిపోయింది. అందువల్ల సైబర్ భద్రత రోజురోజుకీ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. సంస్థలతో పాటు వ్యక్తులకూ ఇది తప్పనిసరి వ్యవహారంగా మారిపోయింది. కానీ చాలామంది తమకేమీ కాదని, తమ సమాచారానికి పెద్దగా ప్రాధాన్యం లేదనే ధీమాతో వ్యవహరిస్తున్నారు. అలాంటి కొన్ని అపోహల గురించి తెలుసుకుని, అప్రమత్తంగా ఉండడం నేర్చుకుందాం.

## నాకేం కాదని అనుకోవద్దు

'నా మీద ఎవరు దాడి చేస్తారు? కాబట్టి సైబర్ సెక్యూరిటీ గురించి చింతించాల్సిన అవసరం లేదు' అని చాలామంది భావిస్తుంటారు. ఇది ప్రమాదకరమైన అపోహ. హ్యాకర్లు, సైబర్ నేరగాళ్ల ప్రముఖులనే కాదు..వివిధ రకాల వ్యక్తులు, సంస్థలను లక్ష్యంగా పెట్టుకుంటారని మరవొద్దు. అంతర్జాలంతో అనుసంధానమైన ప్రతి ఒక్కరికీ ముప్పు పొంచే ఉంటుంది. సైబర్ నేరగాళ్లు ఆటోమేటెడ్ సాధనాలతో నిరంతరం ఇంటర్నెట్‌ను జల్లెడ పడుతూనే ఉంటారు. చిన్న గుట్టు దొరికినా దాడికి తెగబడతారు. కాబట్టి తమను, తమ డేటాను కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండటం, సెక్యూరిటీ పద్ధతులు పాటించడం తప్పనిసరి.

## బలమైన పాస్‌వర్డ్ ఉంటే చాలదు

'బలమైన పాస్‌వర్డ్ ఉంటే చాలు. నా ఖాతా సురక్షితంగా ఉన్నట్టే' అన్నది మరికొందరి ఆలోచన. కఠినమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవటం ఉత్తమమే కావొచ్చు కానీ ఇదొక్కటే సరిపోదు. సైబర్ నేరగాళ్లు నిజమైన బ్యాంకు అధికారులు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల మాదిరిగా నమ్మించి ఖాతా నంబరు, పాస్‌వర్డ్‌లను ధ్రువీకరించుకోవాలని ఈమెయిళ్లు పంపొచ్చు. వీటి ద్వారా రహస్య సమాచారాన్ని తస్కరించొచ్చు (ఫిషింగ్). కాబట్టి ప్రతి ఆన్‌లైన్ ఖాతాకు విడివిడిగా ప్రత్యేక, సంక్లిష్ట పాస్‌వర్డ్‌లను పెట్టుకోవడంతో పాటు ఎక్కడ వీలుంటే అక్కడ ట్యూఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.

## యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ ఉన్నా..

'నా సిస్టమ్‌కు యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ ఉంది. ఇంకేం కావాలి? ఏమీ కాదు' అని కొందరు నిశ్చింతంగా ఉంటారు. ఒకసారి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని పనైపోయిందని భావిస్తుంటారు. నిజానికి సైబర్ భద్రత విషయంలో యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ పాత్ర చాలా కీలకం. ఇది మంచి రక్షణ కల్పిస్తుంది. అయితే ఇదే పూర్తిగా కాపాడుతుందని చెప్పలేం. సాధారణంగా తెలిసిన మాల్వేర్లను గుర్తించి, తొలగించేలా యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్లను రూపొందిస్తారు. కానీ కొత్తగా పుట్టుకొచ్చే ముప్పులను ఇవి పట్టుకోలేకపోవచ్చు. అధునాతన తరహా



దాడులను అడ్డుకోలేకపోవచ్చు. కాబట్టి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవటంతో పాటు దాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలి కూడా. బలమైన ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. బ్రౌజింగ్ చేసేటప్పుడూ పొరపాట్లకు తావివ్వకుండా చూసుకోవాలి.



**ఫిషింగ్ మెయిళ్లను పట్టుకోలేకపోవచ్చు**

'ఫిషింగ్ మెయిళ్లన్నింటినీ ఇట్టే గుర్తిస్తా' అని కొందరు ధీమాగా అంటుంటారు. ఇది తప్పు. ఫిషింగ్ ఈమెయిళ్లు రోజురోజుకీ అధునాతనంగా మారుతున్నాయి. వీటిని చూడగానే పోల్చుకోవటం అన్నిసార్లూ సాధ్యం కాదు. సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా ప్రవరిస్తుంటారు. ఫిషింగ్ మెయిళ్లు విశ్వసనీయమైనవి, అసలు సంస్థలవే అని నమ్మించేందుకు ప్రయత్నిస్తుంటారు. ప్రాచుర్యంలో ఉన్న లోగోలను వాడుతుంటారు. మెయిల్‌కు స్పందించటం అత్యవసరమనీ నమ్మబలుకుతుంటారు. అందువల్ల మెయిల్‌ను పంపించినవారి అడ్రస్‌ను ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలి. లింక్స్ మీద క్లిక్ చేసేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.

**వై-ఫై నెట్‌వర్క్‌లన్నీ సురక్షితం కాదు**

వై-ఫై నెట్‌వర్క్‌లు మంచివే. వాటిని వాడితే ఇబ్బందేమీ ఉండదు' అని మరికొందరు అపోహ పడుతుంటారు. ఇది నిజం కాదు. కాఫీ దుకాణాలు, హోటళ్లు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్ల వంటి చోట్ల అందరికీ అందుబాటులో ఉంటే వై-ఫై నెట్‌వర్క్‌లు సురక్షితం కాదు. హ్యాకర్లు వీటిపై డేగ కన్ను వేసి ఉంచుతారు. తేలికగా నెట్‌వర్క్‌లోకి చొచ్చుకొచ్చే అవకాశముంది. రహస్య సమాచారాన్ని తస్కరించే ప్రమాదముంది. అందువల్ల పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్‌ల వాడకంలో జాగ్రత్త అవసరం. రహస్య సమాచారాన్ని యాక్సెస్ లేదా ట్రాన్స్ ఫర్ చేయొద్దు. కనెక్షన్‌ను ఎన్‌క్రిప్ట్ చేసుకోవటానికి, భద్రతను పెంచుకోవటానికి వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) వాడుకోవాలి. 'మొబైల్ ఫోన్ల మీద సైబర్ దాడులు జరగవు' అనేది చాలామంది నమ్మకం. ఇది అపోహ మాత్రమే. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ల వాడకం విస్తరిస్తున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు వీటిని కూడా లక్ష్యంగా చేసుకోవటం ఎక్కువైంది. హానికర యాప్‌లు, వెబ్‌సైట్లు, రక్షణలేని వై-ఫై నెట్‌వర్క్‌ల వంటివన్నీ మొబైల్ పరికరాలకు ముప్పు తెచ్చిపెట్టేవే. కాబట్టి ఎప్పటికప్పుడు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

## గాజా గిజగిజ

**(10వ పేజీ తరువాయి)**

దీన్ని ఇజ్రాయెల్ తెలుసుకోవడం మంచిది. దీనికి ఒకే ఒక పరిష్కారం పాలస్తీనీయుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను అంగీకరించడం. అదే సమయంలో అమాయక పౌరులకు హాని కలిగించే చర్యలను నిర్ద్వంద్వంగా ఖండించాలి. భద్రత ఇజ్రాయిలీలకు మాత్రమే కాదు, పాలస్తీనీయులకు కూడా ఉండాలి. మానవ హక్కులు, పూర్తి స్థాయి పౌరసత్వం, తమ స్వస్థలాలకు తిరిగి వచ్చే పాలస్తీనీయుల హక్కును అమలు చేసేం దుకు ఐరాస కృషి చేయాలి. రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని పైపై మాటలు చెబుతున్నప్పటికీ పాలస్తీని యన్లపై అణచివేతను నివారించడానికి ఇన్నేళ్లలో అమెరికా, దాని మిత్రపక్షాలు చేసిందేమీ లేదన్నది వాస్తవం.



**శాంతి కావాలి:** పశ్చిమాసియాలో అగ్ర రాజ్యాల ప్రమేయం తగ్గితే తప్ప పాలస్తీనాలో శాంతికి మార్గం ఏర్పడుతుంది. దీనికోసం 75 సంవత్సరాల కిందట పాలస్తీయన్ల నివసించే ఈ ప్రాంతంలో ఓస్లో ఒప్పందాలు ప్రకారం రెండు దేశాలుగా ఏర్పాటు జరిగినా, లేక కేవలం ఒకే దేశంలో అందరూ సమ భాగస్వాములుగా పరస్పర గౌరవం ఆధారంగా జరిగిననాడు అక్టోబరు 7 వంటివి తిరిగి పునరావృతం కావని చెప్పవచ్చు. అణచివేత దాడులు ప్రతిదాడులు పరిష్కారం అనుకున్ననాడు ఈ చిచ్చు ఇలా రగులుతూనే ఉంటుంది. సామాన్య ప్రజానీకం దీనిలో బలి అవుతూనే ఉంటారు. ఆగ్రహం, ఆవేశం ఉండొచ్చు. కానీ సంయమనం మరిచి ఆగ్రహ కారకుల్ని నిర్మూలించాలనుకోవటం ఉన్మాదమే అవుతుంది. చివరికది స్వీయ విధ్వంసానికి దారి తీస్తుంది. దీనిని సామ్రాజ్య వాద దేశాలు గుర్తించాలి. ప్రపంచ శాంతికి ఉగ్రవాదం ఎంత ప్రమాదకారో సామ్రాజ్య వాదం కూడా అంతే ప్రమాదకరమన్నది అందరూ గుర్తించాలి. ప్రపంచ యుద్ధాల సమయంలో ఎవరిది తప్పు ఎంత అని బేరీజు వేస్తూ యుగాలు గడిచిపోతున్నాయిగానీ, ఎవరో ఒకరు ఒకచోట ఆగటం లేదు. ఈ మారణ హోమం చాలు అని ఆపి, ఇద్దరి లాభాలను వదులుకుని ఒక పరిష్కారం చూసుకుందా మనే ఆలోచన చేయటం లేదు. అందుకు ఒక విశ్వసనీయత గల మధ్యవర్తి కావాలి. ఆ మధ్యవర్తికి నిష్పాక్షిక ఎజెండా ఉండాలి. ఇన్నేళ్ల ప్రజాస్వామిక చరిత్రలో ఈ ప్రపంచం ఆ దిశగా సాధించింది ఏమీ లేదు. ఇప్పుడు ఇజ్రాయెల్, హమాస్ పక్షాన వివిధ దేశాలు, రాజ్యేతర శక్తులు రంగ ప్రవేశం చేస్తున్న తరుణంలో ప్రపంచ దేశాలు వివిధ గ్రూపులుగా ఏర్పడి మూడవ ప్రపంచ యుద్ధం రావడానికి కూడా అవకాశం లేకపోలేదు. నాగరికతకు, ప్రజాస్వామ్యానికి తామే ప్రతినిధులమని చెప్పుకునే గొప్ప గొప్ప దేశాలు, ఈ హింస దీర్ఘ కాలం సాగకుండా ఈ మారణ హోమాన్ని నిలుపుదల చేసి పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొనే దిశగా అడుగులు పడాలి. నిజానికి ఒక బలమైన శక్తిగా నిలబడిన ఇజ్రాయెల్‌కు శాంతి గురించి ఎక్కువ బాధ్యత ఉంది. దీనికై పాలస్తీనా, ఇజ్రాయెల్ భూభాగాలు పునర్విభజన జరిగి, రెండు స్వతంత్ర్య, సార్వభౌమ రాజ్యాలుగా ప్రపంచ పటం మీద నిలిచిన రోజునే ఈ మారణ హోమం చల్లారుతుంది.

కథ

# గల్లగురిగి

రమేష్ మాండ్ర

“తాతా... వంద రూపాయలు ఇయ్యవా” “వంద రూపాయలా... ఎందుకు పిల్లగా”

“నాకు గవర్నమెంట్‌దాంట్లో సీటు వచ్చింది. ఈ రోజు హాస్టల్‌కి పోతున్నా”

“అంతేనా... మీ నానమ్మ దగ్గర ఉన్నాయి. అడిగి తీసుకోపో” అని అన్నాడు రాజయ్య.

“సరే తాతా” అని పరిగెత్తుకుంటూ నానమ్మ దగ్గరకి వెళ్లాడు చిన్నా.

“నానమ్మా! డబ్బులు..”

“ఇస్తాగానీ, మంచిగ ఉంటవా.. అక్కడ ఏడుస్తవా?” అని అనుకుంటూ రెండు వందలు ఇచ్చింది చిన్నావాళ్ల నానమ్మ గౌరమ్మ.

“ఒరేయ్ చిన్నా.. మీ నాన్న వచ్చినడంటే ఒక్క క్షణం కూడా ఆగడు. తొందరగా వెళ్లి స్నానం చేసి, బీరువాలో కొత్త బట్టలు ఉన్నాయి వేసుకోపో” అని గట్టిగా అరుస్తుంది చిన్నావాళ్ల అమ్మ కవిత.

స్నానం చేసి వచ్చి బీరువా తీసిండు చిన్నా. కొత్త బట్టలు వేసుకొని అద్దంలో చూసుకుంటూ మురిసిపోతున్నాడు.


“చిన్నా! రెడీ అయినవా?” అని అన్నది కవిత.

“అమ్మా వస్తున్నా” అని బీరువా డోర్ పెడుతున్నప్పుడు గల్లగురిగి కనిపించింది చిన్నాకి. అందులో నుంచి డబ్బులు తీద్దాం అని చాలాసేపు ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించినా రాకపోయేసరికి పక్కన పెట్టేసాడు. కనీసం బీరువాలో ఏమైనా డబ్బులు దొరుకుతాయేమోనని బట్టల కింద వెతికాడు. అప్పుడే వాళ్ల అమ్మ చీరె కింద ఒక గొలుసు దొరుకుతుంది చిన్నాకి. ఆ గొలుసు తీసుకొని ఆ గల్లగురిగిలో వేసేస్తాడు. ఆ రోజు సరదాగా తను చేసిన చిన్న పని వల్ల వాళ్ల కుటుంబం ఎన్ని ఇబ్బందులు ఎదురుకోబోతున్నారో అప్పుడు తెలియదు చిన్నాకి.

అప్పుడే పొలం నుంచి ఇంటికి వచ్చాడు చిన్నా వాళ్ల అమ్మ నాన్న శ్రీను “ఒరేయ్ అన్నీ సర్దుకున్నావా?” అన్నాడు.

అన్ని బ్యాగులల్ల పెట్టిన, ఇగ అందరం తిని బయలుదేరుదాం” అంది కవిత.

చిన్నా, శ్రీను, కవిత ముగ్గురూ కలిసి హాస్టల్ దగ్గరికి బయలుదేరుతారు. చిన్నాని హాస్టల్‌లో చేర్పించి, కొద్దిసేపు అక్కడే ఉండి, మా వాడిని కొంచెం చూసుకోండి అని వార్డెన్‌కి చెప్పి బయటకి వచ్చారు. అప్పటివరకు మంచిగానే ఉన్న చిన్నా




మెల్లగా ఏడవటం మొదలుపెట్టాడు. అది చూసి వాళ్ల అమ్మ కూడా ఏడ్చింది.

“నువ్వు ఏడిస్తే మళ్లీ వాడు భయపడతాడు. రా పోదాం, బండి ఎక్కు” అని అన్నాడు శ్రీను.

లోపల కొంచెం బాధగా ఉన్నా ఎక్కువసేపు అక్కడ ఉంటే మళ్లీ ఇంటికి వస్తా అని అంటాడేమో అని శ్రీనుకి భయం. మొత్తానికి చిన్నాని హాస్టల్‌లో ఉంచి, ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు ఇద్దరు.

రాత్రి అందరు కూర్చుని భోజనం చేస్తున్నారు. వాడు తిన్నాడో లేదో, ఎట్లా ఉన్నాడో, ఎవరైనా దోస్తులు అయ్యుంటరా, రేపు ఒకసారి వెళ్లి చూసి వద్దామా అని మాట్లాడుకుంటూ తింటున్నారు.

అప్పుడే ఒక ఫోన్ వచ్చింది శ్రీనుకి, తనకు ముప్పై వేలు అప్పు ఇచ్చిన నాగేంద్ర దగ్గర నుంచి. నెల నెలా వడ్డీ సరిగ్గానే కడుతున్నాడు. కానీ ఈ నెల మొత్తం ఇస్తా అని మాట ఇచ్చిండు. కొంచెం భయంతోనే ఫోన్ ఎత్తిండు శ్రీను.

“అన్నా... నమస్తే”

“హా.. నమస్తే! ఏమైంది ఈరోజు ఇంటికి వచ్చేసరికే ఎక్కడికో వెళ్లినవుగా”

“మా వాడిని హాస్టల్‌లో జాయిన్ చేయడానికి వెళ్లినా అన్న”

“అవునా... సరే! రేపు పొద్దున ఇంటికి వస్తా, డబ్బులు ఇచ్చేయ్ మరి”

“అన్నా... ఇంకో నాలుగు రోజులు ఆగరాదే” అని అన్నాడు శ్రీను.

“ఏంది తమాషాలా... ఇప్పటికే చాలా రోజులు ఆగిన. ఇగ నాకు ఏమీ చెప్పకు. రేపు అయితే నా పైసలు నాకు కావాలి” అని ఫోన్ పెట్టేసిండు నాగేంద్ర.

“ఏమైందయ్యా” అని అడిగింది కవిత.

నాగేంద్రన్న రేపు పొద్దునకల్లా డబ్బులు కావాలి అంటున్నాడు. చేతిలో ఒక్క రూపాయి కూడా లేదు. ఏమి చేయాలో అర్థమవుతలేదు అని అనుకుంటూ చేయి కడిగేసుకున్నాడు శ్రీను.

“బయట ఎక్కడైనా అడగరాదు” అని అన్నది కవిత.

“ఈ అప్పు తీర్చడం కోసం ఇంకో అప్పు చేయాలే. అయినా ఇప్పుడు ఎవరిని అడిగినా పంట తరువాత ఇస్తా అంటారు”.

“అయితే నా గొలుసు తాకట్టు పెట్టరాదు. డబ్బులు వచ్చిన తరువాత విడిపించుకుందాం”

“తాకట్టు ఎందుకే! ఏమీ వద్దులే. నేనే ఎక్కడైనా ప్రయత్నిస్తా” అన్నాడు శ్రీను.

**'శ్రీనూ, ఉన్నావా?"**

**"అన్నా వస్తున్నా" అని బయటకు వచ్చిండు శ్రీను.**

**"అన్నా లోపలికి రా. బయటనే నిలబడ్డవేంది" అని నాగేంద్రని లోపలికి తీసుకుని వెళ్లాడు.**

**"నాకు పని ఉంది. తొందరగా డబ్బులు ఇస్తే పోతా"**

**"అన్నా, ఇంకో పది రోజులు ఆగరాదు" అని అన్నాడు శ్రీను.**

"ఇప్పుడు మళ్లీ వేరే ఎవరిని అడుగుతావుగానీ రేపు పొద్దున గొలుసు తాకట్టు పెట్టి డబ్బులు తెద్దాం. ఇప్పుడైతే ప్రశాంతంగా పడుకో" అని అన్నది కవిత.

"కవితా! వెళ్లి గొలుసు తీసుకొనిరా" అని అన్నాడు శ్రీను.

"సరే" నని బీరువా దగ్గరికి వెళ్లింది కవిత. బీరువాను తెరిచి బట్టల కింద చెయ్యి పెట్టి చూసింది. కానీ గొలుసు కనిపించలేదు. కొద్దిగా కంగారు మొదలయ్యింది. వెంటనే బట్టలు మొత్తం తీసి చూసింది, గొలుసు కనిపించలేదు.

"ఏమైందే, ఇంకా ఎంతసేపు?"

"ఏమయ్యా.. గొలుసు కనిపిస్తలేదు"

"గొలుసు కనిపిస్తలేదా! మొత్తం వెతికినవా అసలు?" అని బీరువా దగ్గరికి వెళ్లి మళ్లీ మొత్తం వెతికాడు శ్రీను.

"ఎక్కడ పెట్టినవే నువ్వు"

"మొన్న పండగకి వెళ్లి వచ్చిన తరువాత ఆ కొత్త చీర కిందనే పెట్టిన".

"బంగారు గొలుసు ఎవరైనా బట్టల కింద పెడతారా? లోపల డబ్బులు దాచే దాంట్లో పెడతారుగానీ"

వీళ్లిద్దరు మాట్లాడుకుంటుండగానే నాగేంద్ర వచ్చిండు.

"శ్రీనూ, ఉన్నావా?"

"అన్నా! వస్తున్నా" అని బయటకు వచ్చిండు శ్రీను.

"అన్నా, లోపలికి రా. బయటనే నిలబడ్డవేంది" అని నాగేంద్రని లోపలికి తీసుకుని వెళ్లాడు.

"నాకు పని ఉంది. తొందరగా డబ్బులు ఇస్తే పోతా"

"అన్నా, ఇంకో పది రోజులు ఆగరాదు" అని అన్నాడు శ్రీను.

"పది రోజులా.. నేను నిన్ననే చెప్పిన.. రేపు నాకు కచ్చితంగా డబ్బులు కావాలి అని".

"నిజమే అన్నా.. గొలుసు తాకట్టు పెట్టి డబ్బులు ఇద్దాం అనుకున్నా. కానీ ఆ గొలుసు కనిపిస్తలేదు. బీరువా మొత్తం వెతికినం.. ఎక్కడ పోయిందో తెలుస్తలేదు".

"గొలుసు పోయింది? ఏంది నా డబ్బులు నాకు ఇవ్వమంటే గొలుసు పోయింది అని కథలు పడుతున్నావ్"

"నిజంగా అన్నా.. రెండు తులాల గొలుసు. ఇప్పుడు ఏమి చేయాలో అర్థమవుతలేదు"

"ఎన్ని తులాలయితే నాకు ఏంది? ముందు నా డబ్బులు ఇచ్చి తరువాత ఆ సంగతి చూసుకో"

"అన్నా.. ఒక్క నాలుగు రోజులు ఆగు. మా తమ్ముడిని అడిగి ఇస్తా" అని అన్నది కవిత.

"సరే... నాలుగు రోజుల తరువాత వస్తా. మళ్లీ ఏ ముచ్చట చెప్పొద్దు" అని వెళ్లిపోయిండు నాగేంద్ర.

గొలుసు పోయిన విషయం చిన్నగా ఊరుమొత్తం తెలిసింది. కొంతమంది "పాపం.. ఎవడు తీసిండో" అని మాట్లాడుకుంటుంటే– మరికొంతమంది "ఇంట్లోవాళ్లే ఎవరో తీసుంటారు" అని అనుకున్నారు. ఇలా ఎవరికి నచ్చినట్టు వాళ్లు చెప్పుకున్నారు. అందరు ఈ విధంగా మాట్లాడుకుంటున్న విషయం తెలిసి బయటకి వెళ్లడమే తగ్గించేసారు.

నాలుగు రోజుల తరువాత నాగేంద్ర ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తట్లేదు శ్రీను. "నిజంగా నువ్వు బీరువాలోనే పెట్టావా?" అడిగాడు శ్రీను.

"అంటే నేను అబద్ధం చెబుతున్నా అనుకుంటున్నావా? లేకపోతే ఊరిలో వాళ్లు అంటున్నారని నువ్వు కూడా అంటున్నావా"

"అలా కదే. ఎక్కడైనా పెట్టి మర్చిపోయినవా అంటున్నా. అవును.. మన చిన్నగాడు ఏమైనా తీసుంటడా?"

"వాడి సామాన్లు మొత్తం నేనే సదిరినా, వాడేమీ తీయలేదు" "మరి ఇంకా ఎట్లా పోయిందే?" అని అన్నాడు శ్రీను.

"ఏమో! నేనైతే బీరువాలోనే పెట్టాను. మరి ఎవరికి ఏమి అవసరముందో, ఎవరు తీసినరో ఏమో"

"అంటే ఏందే! మేం తీసినం అంటున్నావా?"

"నేను అట్లా అన్నానా? మనం ఇద్దరం పనికి పనికి పోతం. పొద్దునుంచి ఇంట్లో ఉండేది మీ అమ్మా, నాన్న, వాళ్లకి తెలియకుండా ఎవరు తీస్తారు"

"మా ఇంట్లో మేం దొంగతనం చేస్తామా, మాకు ఏమి అవసరం?" అని అన్నాడు రాజయ్య.

"ఏమో! మీకు ఏమి అవసరం ఉందో నాకేం తెలుసు?" అన్నది కవిత.

"అమ్మా! మాకు అంత అవసరం ఉంటే పింఛన్ డబ్బులు ఉన్నాయి. లేకపోతే మా కొడుకుని అడుగుతాం కానీ ఈ దొంగపని మేం ఎందుకు చేస్తాం" అని అన్నది గౌరమ్మ.

"అయినా మా వయసు అయిపోయిందేగానీ మా గుణం ఏమీ మారలేదు. అంత కష్టం అనిపిస్తే ఏమన్నా వేసుకొని చస్తాం కానీ ఇలాంటి పని చేయం" అని అన్నాడు రాజయ్య.

"నాయినా, ఏమి మాట్లాడుతున్నావు, నువ్వు ఆగు" అని అన్నాడు శ్రీను.

"వీళ్లు ఇలా గొడవ పడుతుండగానే "శ్రీనన్నా, సర్పంచ్ మిమ్మల్ని అందరిని వాళ్ల ఇంటికి రమ్మంటున్నాడు" అని చెప్పిండు స్వామి.

సర్పంచ్ ఇంటికి వెళ్లగానే "నాగేంద్రన్నా, నేను చెప్పినగా.. నాలుగు రోజులల్ల ఇస్తానని" అని అన్నాడు శ్రీను.

"ఏమి చెప్పినావురా నువ్వు, నాలుగు రోజులల్ల ఇస్తా అని చెప్పి తరువాత ఫోన్ కూడా ఎత్తట్లేవు. నా డబ్బులు నాకు ఇవ్వరా అంటే– గొలుసు పోయిందని నాటకాలు ఆడుతున్నారు"

"అన్నా, మంచిగ మాట్లాడు, నిజంగానే గొలుసు పోయింది. లేదంటే ఈపాటికి ఎప్పుడో ఇచ్చేటోడిని".

"నా ఇంటికి వచ్చి మళ్లీ మీరే మాట్లాడుకుంటున్నారేందిరా. శ్రీనూ, ఇప్పుడు నీ ఇంట్ల ఏ సమస్య అయినా ఉండొచ్చు. కానీ అప్పు తీసుకున్నాక తల తాకట్టు పెట్టి అయినా తీర్చాల్సిందే. ఇప్పుడు నువ్వు ఏమంటావు మరి" అని అన్నాడు సర్పంచ్. "అన్నా, ఇంకొక్క పది రోజులు ఆగమను. నా బామ్మరిదిని అడిగిన డబ్బులు, అవి రాగానే ఇస్తా"

"నాగేంద్రా విన్నావుగా.. ఒక పది రోజులు అంట ఆగు. అసలు గొలుసు పోయిన బాధలో ఉన్నారు వాళ్లు".

"గొలుసు పోలె, ఏమి పోలే అన్నా. వీళ్లే గొలుసు దాచి మనల్ని పిచ్చోళ్లని చేస్తున్నారు. వీళ్ల ఎలాంటోళ్లో నాకు తెలియదా"

"నాగేంద్రన్నా, నీ ముప్పై వేల కోసం అబద్ధం ఆడాల్సిన అవసరం లేదు మాకు" "ఏమో! తాగిన అప్పులు తీర్చడం కోసం మీ అయ్య తీసిండో లేకపోతే తాకట్టు పెట్టడం ఇష్టంలేక నీ భార్యనే దాచిపెట్టి నాటకం ఆడుతోందో" అని నాగేంద్ర.

ఆ మాట అనగానే అందరు కలిసి నాగేంద్ర మీదికి వెళ్లారు. ఆ గొడవలో శ్రీను నాగేంద్రని కిందకి నెట్టేసాడు. నాగేంద్ర తలకి దెబ్బ తాకింది. మీ పని ఇక్కడ కాదు పంచాయితీలనే చేసుకుంటా అని వెళ్లిపోయాడు.

"అరె, శ్రీనుగా, ఎంత పని చేసినావురా. ఇక్కడే నిమ్మళంగా అయిపోగొడదాం అనుకుంటే పంచాయితీ దాకా తీసుకొని పోయినరు ఏందిరా. సరే.. రేపు పంచాయితీల మాట్లాడుదాం పో" అని లోపలికి వెళ్లిపోయాడు సర్పంచ్.

శ్రీను కుటుంబం తిరిగి ఇంటికి వచ్చేసింది. "మన తరపున ఎవరినైనా తీసుకువెళ్లాలన్నా కనీసం ఓ మూడు వేయిలైనా చేతిలో లేకపోతే ఎట్లా? ఈ టైంలో ఎవరినైనా అడుగుదామన్నా ఎట్లనో అనిపిస్తుంది" అని అన్నది కవిత.



"నా దగ్గర పదిహేను వందలు ఉన్నాయి, తీసుకో అమ్మా" అని ఇచ్చాడు రాజయ్య. అందరి దగ్గర ఉన్న డబ్బులు పోగు చేసి మూడు వేలు అయితే చేసింద్రు. అప్పటివరకు వాళ్ల మధ్య చిన్న చిన్న గొడవలు ఉన్నా ఈ విషయంలో మాత్రం అందరు ఒక్కటై నిలబడ్డారు. పంచాయతీ విషయం తెలుసుకున్న శ్రీను వాళ్ల పెద్దనాన్న ఇంటికి వచ్చిండు.

"పెద్దనాన్నా! నేనే ఫోన్ చేద్దామనుకుంటున్న" అని అన్నాడు శ్రీను.

"రేపు పంచాయతీ ఉందటగా నాగేంద్రది. వాడితోటి ఎందుకు పెట్టుకున్నావురా"

"నేనేం అన్ననే, వాడే తప్పుగా మాట్లాడిండు" అని అన్నాడు శ్రీను. ఇద్దరు కలిసి వాళ్ల దగ్గరి వాళ్లందరికి ఫోన్ చేసి మాట్లాడుతారు రేపు రమ్మని. అప్పుడే చిన్నా హాస్టల్ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది సెలవలు ఉన్నాయి, వచ్చి తీసుకువెళ్లమని.

పంచాయతీ ఉందని చిన్నాని తీసుకురావడానికి వాళ్ల పెద్దనాన్నవాళ్ల కొడుకుని పంపించి, అందరు కలిసి పంచాయితీ ఆఫీస్ దగ్గరకి వెళ్లారు.

"శ్రీనూ, అప్పు కట్టమన్నందుకు కొడతవా? ఊరిలో ఎవరు అడగరనుకుంటున్నావా ఏంది?"

"లేదు బాపూ, అప్పు కట్టమంటే కథలు పడుతున్నారు. మీ అయ్య తీసిండో లేకపోతే మీ పెళ్లాం తీసిందో గొలుసు" అని తప్పుగా మాట్లాడిండు.

"ఏంది నాగేంద్రా! ఎంత అప్పు ఇస్తే మాత్రం ఇంట్లోల్ల గురించి తప్పుగా మాట్లాడతావా?

"డబ్బులు ఇస్తా అని చెప్పి రాత్రికి రాత్రి నా గొలుసు పోయింది అని మాట్లాడుతుంటే ఏమనాలే మరి"

"ఇంతకీ ఆ గొలుసు ఏమైంది కవితమ్మా!" అని అడిగారు పెద్ద మనుషులు.

మొన్న బుధవారం రోజు పండగకి వెళ్లి వచ్చి బీరువాలోనే పెట్టిన. శనివారంరోజు పొద్దున తాకట్టు పెడదామని చూస్తే కనిపించలేదు అని అన్నది కవిత. మరి మీరు కాకుండా ఇంకా ఎవరైనా వచ్చినరా మీ ఇంటికి అని అడిగినరు పెద్ద మనుషులు.

"లేదు.. ఎవరూ రాలేదు".

"మీరు తీయకపోతిరి, బయటివాళ్లు ఎవరు రాలేదు అంటిరి. మరి ఎక్కడికి పోయింది అది. అయినా డబ్బులు తీసుకుందిగాక మా అన్న మీద చెయ్యి వేస్తారా? ఈరోజు ఒక్కడిని కూడా విడిచిపెట్టేదే లేదు" అని అన్నారు నాగేంద్ర మనుషులు.

"ఏమి మాట్లాడుతున్నారు పంచాయితీకి వచ్చి, అయితే మీరు మీరు చూసుకునేది అయితే మేమెందుకు మరి" అని అన్నారు అక్కడ ఉన్న పెద్ద మనుషులు.

అప్పుడే చిన్నాని హాస్టల్ నుంచి తీసుకొని వచ్చాడు బాబాయ్! అక్కడ ఏంది అంతమంది ఉన్నారు?"

"మీ ఇంట్లో గొలుసు పోయిందటరా, అందుకే అమ్మా నాన్న పంచాయతీకి వచ్చింద్రు".

"గొలుసా? అది ఎక్కడ ఉందో నాకు తెలుసు బాబాయ్" అని బండి దిగి ఇంటి వైపు పరిగెత్తాడు చిన్నా.

"సరే నాగేంద్రా? నువ్వు మాటలు అనుడు తప్పే శ్రీనుగాడు నీ మీద చెయ్యి వేయడం తప్పే. ఇద్దరిది తప్పే ఉంది. ఇప్పుడు ఏమి చేయమంటావు చెప్పు.. నాగేంద్ర"

"నేను అనేది ఏముంది.. మీరు ఎట్ల చెప్తే అట్లనే చేస్తా" అని అన్నాడు నాగేంద్ర.

"నువ్వేమంటావ్ శ్రీను, ఇగ నీ ఇంట్లో ఏం జరిగిందనేది మాకు సంబంధం లేదు. పది రోజులు టైం ఇస్తున్నా, ఈలోపు డబ్బులు మొత్తం కట్టు. పోయింది బంగారం కాబట్టి స్టేషన్‌కి పోయి కంప్లైంట్ ఇవ్వు" అని పెద్ద మనుషులు చెబుతుండగానే గల్లగురిగి తీసుకొని వచ్చిండు చిన్నా.

"చిన్నా, ఏంది గల్లగురిగి తీసుకొని వచ్చినావు?" అంది కవిత.

"అమ్మా, నీ గొలుసు ఇందులోనే ఉంది. నేనే హాస్టల్‌కి వెళ్లేటప్పుడు ఇందులోనే వేసినా" అన్నాడు. ఆ మాట వినగానే అందరు సైలెంట్ అయ్యారు. అందరి చూపు మొత్తం గల్లగురిగి మీదనే ఉంది.

చిన్నా చేతిలో నుంచి గల్లగురిగి తీసుకొని పగలగొట్టింది కవిత. అందులో నుంచి డబ్బులతో పాటు గొలుసు కూడా బయట పడింది.

శ్రీను కుటుంబానికి ఒక్కసారిగా గుండెల మీద బరువు మొత్తం దిగినట్టు అనిపించింది.

గొలుసు చూడగానే చిన్నాని కవిత కొట్టబోతుంటే "ఆగమ్మా కవితా, చిన్న పిల్లగానికి ఏం తెలుసు, ఒరేయ్ పిల్లగా ఎంత పని చేసినావురా, ఎవరి జోలికి పోకుండా నిమ్మళంగా ఉండేటోళ్లని ఉత్త పుణ్యానికి పంచాయితీల పడేసినావురా" అని అన్నారు అక్కడున్న పెద్ద మనుషులంతా. చిన్న పిల్లోడు చేసిన పనికి అందరూ తెగ నవ్వుకున్నారు.

ఇలా తను తెలియక చేసిన ఒక పని వల్ల చిన్నా వాళ్ల ఊరిలోనే కాకుండా చుట్టుపక్కల ఊర్లల్లో కూడా బాగా ఫేమస్ అయ్యిండు. తనని చూసి నవ్వుకున్నోళ్లే వాళ్ల కుటుంబాన్ని చూసి పాపం.. అనుకున్నారు.

మొత్తానికి ఆ గొలుసుని తాకట్టు పెట్టి నాగేంద్ర అప్పు తీర్చిండు శ్రీను. ఇగ సెలవులు అయిపోవడంతో చిన్నాని హాస్టల్‌కి పంపించి ఎప్పటిలాగే మళ్లీ వాళ్ల సాధారణమైన జీవనాన్ని కొనసాగించారు.

# కళాప్రపూర్ణ వేంకటరావు

జయసూర్య

**తెలుగులో సాహిత్య పరిశోధన చరిత్రలో దాదాపు అర్ధ శతాబ్ది కాలం, నిరంతరాయంగా పరిశోధన ప్రవృత్తికి నూతన చైతన్యాన్ని, ప్రభావాన్ని సృష్టించిన ప్రతిభామూర్తి నిడుదవోలు వేంకటరావు. తొలినాటి పరిశోధకులలో కళాప్రపూర్ణ వేంకటరావు అగ్రగణ్యులు. సాహిత్య పరిశోధన వికాసంలో తనకు పూర్వ యుగాలయిన బ్రౌణ్య, వీరేశలింగ కాలంనాటి పరిశోధన ప్రవృత్తికి, నూతన చైతన్య విస్తృతిని, ప్రామాణికతను, నిడుదవోలు వేంకటరావు అందించారు.**

ఈ శతాబ్ది సాహిత్య పరిశోధకులలో ప్రాతఃస్మరణీయులు అయిన వేంకటరావు సనాతన పండిత కవులు స్పృశించని వీరశైవ గ్రంథాలను వెలికితీసి, వాటి విలక్షణ భాషా సాహిత్యాలపై దీప్తి ప్రసరింపచేసారు. వీరశైవ వాఙ్మయానికి ప్రశంసనీయమైన సేవలందించిన నిడుదవోలువారు, తెలుగు కవుల చరిత్ర, వచన వాఙ్మయం, వాఙ్మయ చరిత్ర–నిర్మాణం, నిఘంటువులు, గ్రంథ సంస్కరణలు, పీఠికలు, వ్యాసాలు, సమీక్షలు, భాషా వ్యాకరణ ఛందో విశేషాలు ముఖ్యంగా పరిశోధనా రంగాన్ని సుసంపన్నం చేసారు. తాళపత్ర గ్రంథాలలో నిక్షిప్తమైన సరైన పాఠాలను గుర్తించి ఛందో వ్యాకరణాలలోని అపూర్వ విషయాలు బయటకు తీసి కొత్త యతులు ప్రాసలు ఆవిష్కరించారు. దక్షిణ దేశీ యాంధ్ర వాఙ్మయంలో విలక్షణంగా తమిళ, కర్ణాటక రాష్ట్రాలలో వర్ధిల్లిన తెలుగు వాఙ్మయాన్ని సేకరించి సమగ్ర బృహత్ గ్రంథంగా రచించారు. ఉదాహరణ అంటే దేవతా పరమైన స్తోత్ర రూపమైన లఘుకృతి ప్రక్రియ. ఆ చిత్రమైన కృతికి వేంకటరావు జీవం అందించారు. చారిత్రకంగా, తెలుగు ప్రభువులు తమిళ ప్రాంతాలను 300 ఏళ్ల పాలించారు. తంజావూరు, మధుర, పుదుక్కోటైలలో తెలుగు నాయకరాజులు, మహారాష్ట్రులు రాజ్యపాలనలో, 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం' గ్రంథంలో అవిచ్ఛిన్నంగా వర్ధిల్లిన సాహిత్యాన్ని సమగ్రంగా పరిశోధించి తెలుగు ప్రజకు వేంకటరావు అందచేసారు.




కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు బహుముఖ ప్రతిభావంతులు. అద్వితీయ ధారణా మేధావిగా, ఏకసంధాగ్రాహి. ఆయన పరిశోధన రచనలు సహస్రాధికాలు. ఆకాశవాణి ప్రసంగాలు శతాధికాలు. ఆంగ్ల వ్యాసాలు అసంఖ్యాకాలు. కావ్య ఆరంభంలో శ్రీకారం నుండి కావ్యాంతంలోని మంగళ మహాశ్రీ వరకు అక్షరాక్షరం మనస్సులో ప్రతిష్ఠించుకొని, అక్షరం పొల్లు పోకుండా ప్రదర్శించగల ధారణాశక్తి సంపన్నత ఆయనకు ఉండేది. తెలుగు సాహిత్య చరిత్రలో అవిశ్రాంత సాహిత్యోపాసకునిగా, అవిరళ పరిశోధకునిగా, సంస్కృతాంధ్ర ద్రవిడ భాషా సాహిత్యాన్ని చదివిన, విన్న ప్రతి అక్షరాన్ని ధారణలో నిలుపుకొన్న అపూర్వ ధీమంతులు.



నిడుదవోలు వేంకటరావు ప్రతిభ, పరిశోధన, రచనా వ్యాసంగం అవిచ్ఛిన్నంగా మూడు దశాబ్దాలు పైగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసాయి. సాహిత్యమే నిత్య కర్మానుష్ఠానంగా జీవించిన ఆయనను పరిశోధనా పరమేశ్వర, జంగమ విజ్ఞాన సర్వస్వం, ఏకసంధాగ్రాహి ఎన్నో ప్రశంసలు వరించాయి. అన్నింటికీ మకుటాయమానంగా 1973లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతో సత్కరించింది.

గ్రంథాలకు పీఠికలు, ప్రాచీన ప్రబంధాల ప్రచురణలు, శాస్త్ర గ్రంథాలు కోకొల్లలు. మదరాసు, హైదరాబాద్ వంటి విశ్వవిద్యాలయాలలో అధ్యాపక పరిశోధనలు, వావిళ్ల సంస్థతో ప్రాచీన కావ్యాల పరిష్కరణ, ఆంధ్ర పత్రిక, భారతి యితర పరిశోధనా పత్రికలలో వ్యాసాలు ఆయన జీవన సర్వస్వం సాహితీ సేవకే అంకితమైంది. శతాబ్దాలుగా మరుగున పడిన తెలుగు సాహిత్యాన్ని పునరుద్ధరించి, విద్వత్కవి లోకాన్ని కూడా విస్మయపరిచే పరిశోధనా అగ్రగణ్యునిగా తెలుగు భాషకు ఎనలేని సేవలందించారు.

1903 జనవరి 7న విజయ నగరంలో జన్మించిన నిడుదవోలు వెంకటరావు 1964 జనవరిలో మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతిగా పదవీ విరమణ చేసారు. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వేంకటరావును 'పరిశోధన పరమేశ్వరుని'గా కీర్తించారు. 1919 నుండి పద్యకవితా సాహిత్యంలో ప్రవేశించినా, పరిశోధకునిగా 1925 నుండి జీవిత పర్యంతం పరిశోధనా తపస్విగా జీవించారు. 1982 అక్టోబరు 15న దివంగతులయ్యారు. ఈ పరిశోధనా పరమేశ్వరున్ని గురించి డాక్టర్ నిష్టల వెంకటరావు సిద్ధాంత గ్రంథం సమర్పించారు.

తెలుగుభాష వెలుగుతున్నంత వరకు, తెలుగు వాఙ్మయం ప్రవహిస్తున్నంతవరకు, తెలుగులో పరిశోధనా మాధుర్యం వెల్లివిరిసినంత కాలం నిడుదవోలు వేంకటరావు విద్వత్కాంతి ప్రసరిస్తూనే ఉంటుంది.

# నా కోసం, అన్నీ నా కోసం..

యామిజాల జగదీశ్

ప్రేమ లేని నిర్లక్ష్యవాదులకు, విలువైన మనిషి ప్రాణం ఎంతో బాధతో రాస్తున్న మాటలివి. ఈ ప్రపంచంలో అత్యంత విలువైనది ఏది? కోహినూర్ వజ్రమనో.. గుళ్లూ గోపురాలనో మీరూ ఏవేవో అనుకుని ఉంటే అవన్నీ తప్పే. నేనే విలువైనదానిని. అత్యంత విలువైన విషయం నేనే.. అదే ప్రాణం.. ప్రపంచంలో కోటీశ్వరులందరూ బతికున్నంత కాలమే కోటీశ్వరులు. మరణించిన తర్వాత కోటీశ్వరుడనే మాట ఎక్కడిదీ? కోటీశ్వరులు కూడబెట్టిన ఆస్తిపాస్తుల కన్నా వాటికి సొంతదారులైన వారందరూ నన్నేగా ప్రాణప్రదంగా చూసుకుని ఉంటారు. అందులో ఎవరికైనా ఏదన్నా అనుమానముందా.. ఉంటుందా...

ఒక మనిషి నుదుట తుపాకీ గురి పెట్టి అడిగితే ఏదన్నా ఇచ్చేస్తారుగా... నన్ను కాపాడుకోవడం కోసం యుద్ధభూమిలోనో, సునామీ, వరదలు, భూకంపంలోనో క్షణంలో మనిషి ప్రాణాలు పోతాయి కదా. కాదంటారా.. అయితే అటువంటి ప్రకృతి వైపరీత్యాలప్పుడు కూడా వీలున్నంత మేరకు నన్ను కాపాడుకోవడానికి మనిషి పడే తాపత్రయం ఇంతా అంతా కాదు. అవునంటారా.. కాదా? మనిషి శరీరంలో అయిదు కోట్ల కణాలు చనిపోయుంటాయి. కొత్తగా అయిదు కోట్ల కణాలు పుట్టుకొస్తాయి. ఈ వాక్యాన్ని మీరు చదవడం పూర్తి చేసేలోపు.

దేహంలో సమాచారం మెరుపు వేగంతో ప్రయాణం చేస్తుంటుంది. దాని ప్రయాణ వేగం గంటకు 248 నాళాలని కొన్ని లెక్కలు చెప్తున్నాయి. దేహంలో నలభై అయిదు మైళ్ల మేరకు విస్తరించి ఉంటాయి నరాలు. హృదయం ఏడాదికి నాలుగు కోట్ల సార్లు కొట్టుకుంటుంది. దేహంలో ఉన్న 5.6 లీటర్ల రక్తం ఓ నిమిషంలో దేహమంతటా మూడు సార్లు సంచరిస్తుంది. కానీ వీటి గురించి రవ్వంత కూడా ఆలోచించని నిర్లక్ష్యవాదుల కోసమే ఈ ఉత్తరం రాస్తున్నాను మీ ప్రాణంగా.

మెదడువాపు వ్యాధితో ప్రపంచ వ్యాప్తంగా ఎందరో చనిపోయారు. ఇప్పటికీ అక్కడక్కడా చనిపోతున్నా రంటూ వింటూ ఉంటారు. రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నవారి సంఖ్య ఏ ఏడాదికి ఆ ఏడాది పెరుగుతూ పోతోంది. 2005లో తీసిన గణాంకాల ప్రకారం మన భారతదేశంలో ఆరు నిమిషాలకు ఒకరు చనిపోయారు. అంటే ఒక గంటకు పది మంది, ఒక రోజుకు 240 మంది. ఒక నెలకు 7200 మంది. ఒక ఏడాదికి 86,400 మంది. ఈ లెక్కన ప్రపంచం మొత్తం మీద రోడ్డు ప్రమాదాలలో ఎందరెందరు చనిపోతున్నారో కదా. ఆలోచించేరా! అగ్ని ప్రమాదంలో మరణించినవారి లెక్క వేరు. 2007లో భారతదేశంలో అగ్నిప్రమాదాల్లో మాత్రమే 20 వేల మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇది కాకుండా నీటిలో మునిగిపోయి, వైమానిక ప్రమాదాల్లో మరణించినవారు ఇంకొందరు.

ఇన్ని రకాల ప్రమాదాలు ఎలా ఏర్పడుతున్నాయి? ఒక్క క్షణం నిర్లక్ష్యంతోనే. కనుక నా విషయంలో జాగరూకత ఎంత ముఖ్యమో తెలిసింది కదా. రోడ్డు ప్రమాదాలకు సంబంధించినంత వరకు వేగం, మద్యం తాగి నడపడం, లేక వాహనాలలో యాంత్రిక లోపం, రహదారులలో సరైన వెలుగు లేకపోవడం, రోడ్లు ఎత్తుపల్లాలుగా ఉండటం అని అనేక రకాల కారణాలు చెప్పుకుంటూ పోవచ్చు. కానీ అన్నింటిలోనూ ఉన్నది నిర్లక్ష్యమే. వాహనాలు తయారు చేసేవారు మొదలుకొని మెకానిక్ వరకూ ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించడం ఎంతైనా ముఖ్యం. ఇది ప్రాణంతో సంబంధించిన విషయం అని మనసులో గుర్తుంచుకోవాలి. అప్పుడు రోడ్డు ప్రమాదాలను కొంతమేరకైనా నివారించవచ్చు.


పలువురు ముఖ్య నేతలు విమాన ప్రమాదాలలో మరణించడానికి కారణం ఆయా విమానాలలో తలెత్తిన సాంకేతిక లోపాలే అని వేరేగా చెప్పక్కర్లేదు.

అలాగే నౌకలు మునిగిపోయి చనిపోయినవారు. కొన్ని సంఘటనలలో లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణం చేయడం కారణంగా చెప్పవచ్చు. అది ఎంత తప్పు.. ఎంత నిర్లక్ష్యం. కొన్ని ప్రమాదాలలో నౌకలో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడమని తేలింది. ఇటువంటి సంఘటనలలో ఎందరెందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారో వేరేగా చెప్పాలా...

హెల్మెట్ అనేది ప్రాణం కాపాడే వాటిలో ఒకటని చెప్పినా సరే ద్విచక్ర వాహనదారులు అది లేకుండా నడుపుతుంటారు. ఇక్కడ కూడా వారి నిర్లక్ష్యమే కదా కారణం. ట్రాఫిక్ సిగ్నల్ మనకు ఉపయోగపడే ఓ మంచి మిత్రుడే కదా. కానీ ట్రాఫిక్ సిగ్నల్‌ని పట్టించుకోకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైనవారి గురించి మనం పత్రికల్లో చదువుతుంటాం, టీవీలలో చూస్తుంటాం. ఎన్ని వేల ప్రమాదాలు జరగాలి... మన సౌకర్యం కోసం, మన ప్రాణ రక్షణ కోసమేగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండేవి. కానీ ఆ నిబంధనలను సైతం పాటించక నన్ను పోగొట్టుకోవడం ఏ విధంగా సబబో ఆలోచించండి. రైళ్ల విషయంలోనూ అంతే. కొన్ని రైల్వే గేట్ల దగ్గర గేటు మూసి వున్నా దాని కింద నుంచి అవతలకు వెళ్లడానికి ప్రయత్నించి ప్రమాదానికి గురవడం చూస్తూనే ఉంటాం. ఇక్కడ కూడా వారు నన్ను నిర్లక్ష్యంగా చూడటమే కదా కారణం.

ఇక రోడ్లలో ఎక్కడ పడితే అక్కడ గోతులు తవ్వడం, పనయ్యాక వాటిని పూడ్చకపోవడం, అది తెలియక దానిలో పడిపోవడం, దెబ్బలు తగిలించుకోవడం,

(మిగతా 27వ పేజీలో..)



# విచిత్రమైన 'డయోమీడ్' దీవులు

యేచన్ చంద్రశేఖర్

**ఈ సువిశాల భూగోళంపై ప్రపంచంలో మనకు తెలియని వింతలు, విడ్డూరాలు ఎన్నో ఉన్నాయి. మనకు తెలిసినవి కొన్నయితే, తెలియనివాటి గురించి తెలుసుకున్నప్పుడు ఔరా! అనిపించకమానదు. గడ్డకట్టే ధృవాలు, అతిపెద్ద సముద్రాల నుండి అతి చిన్న ద్వీపాల వరకు, మన భూగోళం స్థలాకృతి మనం ఊహించగలిగేదానికంటే చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రకృతి అద్భుతాలను చూసినప్పుడు లేదా తెలుసుకున్నప్పుడు మనం సంభ్రమాశ్చర్యాలకు గురి కావడం అత్యంత సర్వసాధారణం. సృష్టిలోని అలాంటి ఒక అద్భుతం డయోమీడ్ దీవులు.**

'డయోమీడ్' అనే ఒకే పేరుతో అమెరికా, రష్యాలలో రెండు దీవులున్నాయి. రష్యా ఆధీనంలో ఉండే 'బిగ్ డయోమీడ్', అమెరికా ఆధీనంలో ఉంటే 'ది లిటిల్ డయోమీడ్' దీవుల మధ్య దూరం కేవలం 3.8 కిలోమీటర్లు లేదా 2.4 మైళ్లు. అయినప్పటికీ సమయం పరంగా 21 గంటల వ్యత్యాసం ఉంటుంది.

ఈ దీవులను మొట్టమొదటగా 1728 ఆగస్టు 16న డానిష్ నావిగేటర్ విటస్ బెరింగ్ కనుగొన్నాడు. అదే రోజున రష్యన్ ఆర్థోడక్స్ చర్చి 'సెయింట్ డయోమీడెస్' జ్ఞాపకార్థం ఉత్సవాలు జరుపుకోవడంతో ఈ దీవులకు 'డయోమీడ్ ఐలాండ్స్' అనే పేరు వచ్చింది. 1732లో ఒక రష్యన్ జియోడెసిస్ట్, మిఖాయిల్ గ్వోజ్డేవ్, ఈ రెండు ద్వీపాలకు రేఖాంశం, అక్షాంశాలను నిర్ణయించారు. అలాస్కా, సైబీరియా మధ్య బేరింగ్ జలసంధిలో 'బిగ్ డయోమీడ్', 'ది లిటిల్ డయోమీడ్' అనే ఈ రెండు దీవులున్నాయి.

అంతర్జాతీయ తేదీ రేఖకు ఇరువైపులా ఉన్నందున వీటిని 'ఎస్టర్ డే అండ్ టుమారో ఐలాండ్స్' అని కూడా పిలుస్తారు. వేసవిలో సగటున 40 నుండి 50 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు ఉండే ఉష్ణోగ్రతలు; శీతాకాలంలో మరింత చల్లగా సగటున 6 నుండి 10 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు ఉంటుంది. ప్రతి సంవత్సరం, ఆర్కిటిక్ సముద్రపు మంచు దక్షిణ దిశగా బేరింగ్, చుక్చీ సముద్రాల నుండి జలసంధిలోకి విస్తరిస్తుంది. అయితే జూన్ నాటికి సాధారణంగా కరగడం ప్రారంభమయ్యే మంచు, ఉత్తరం వైపుకు వెనక్కి వెళ్లి, నల్లని నీటిని విసర్జిస్తుంది. రెండు ద్వీపాల మధ్య ఉన్న నీరు రెండు దేశాల సముద్ర సరిహద్దు ద్వారా విభజించబడింది. ఈ ప్రకరణానికి చారిత్రాత్మకంగా 'మంచుతెర' లేదా 'ఐస్ కర్టెన్' అని పేరు పెట్టారు. అంతర్జాతీయ తేదీ రేఖ ఈ రెండు ద్వీపాలను విభజిస్తుండటంతో లిటిల్ డయోమీడ్ ద్వీపంలో నిలబడిన వ్యక్తి బిగ్ డయోమీడ్‌లోని దృశ్యాన్ని వీక్షిస్తున్నప్పుడు 21 గంటలు భవిష్యత్తులోకి చూస్తున్నట్టు అన్నమాట.



1867లో యునైటెడ్ స్టేట్స్, రష్యా నుండి అలాస్కాను కొనుగోలు చేసినప్పుడు అందులో 7.3 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల 'లిటిల్ డయోమీడ్' లేదా 'క్రుసెన్‌స్టెర్న్ ద్వీపం' ఉంది. కాగా, ఆ కొనుగోలు ఒప్పందంలో 'రత్మనోవ్ ఐలాండ్' అని పిలువబడే 'బిగ్ డయోమీడ్' చేర్చకపోవడంతో అది రష్యా ఆధీనంలోనే ఉండిపోయింది. తదనంతర కాలంలో రెండు దేశాలు ద్వీపాల మధ్య సరిహద్దు రేఖను నిర్ణయించుకున్నాయి. ఈ రెండు దీవుల మధ్య మార్గాన్ని 'మంచుతెర' అని పిలుస్తారు. సాధారణంగా శీతాకాలంలో ఈ రెండు ద్వీపాల మధ్య ఒక మంచు వంతెన విస్తరిస్తుంది. అందువల్ల కొన్ని సార్లు యునైటెడ్ స్టేట్స్, రష్యాల మధ్య కాలినడకన చేరుకోవడం సిద్ధాంత పరంగా సాధ్యమైనప్పటికీ అటువంటి ప్రయాణం చట్టబద్ధంగా కచ్చితంగా నిషేధించబడింది.

## జీవన ప్రమాణాలు

డయోమీడ్ దీవుల నైసర్గిక స్వరూపం, కఠినమైన వాతావరణ పరిస్థితుల కారణంగా అక్కడి ప్రజలు అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది. శీతాకాలంలో డయోమీడ్ దీవులలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా మైనస్ 14 డిగ్రీల స్థాయికి చేరుకోవడంతో పాటు డిసెంబరు నుండి జూన్ వరకు మంచుతో గడ్డ కట్టుకుపోయి వేసవిలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల స్థాయికి చేరుకుంటుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వనరుల పరిమిత సౌలభ్యత, కనీస ఆర్థిక అవకాశాలు తీరే మార్గాలు లేకపోవడతో అక్కడి ద్వీపవాసులు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కోవలసి వస్తుంది. అయినప్పటికీ అలాస్కాకు చెందిన ఇనుపియాట్ జాతి ప్రజలు 3000 సంవత్సరాలకు పైగా లిటిల్ డయోమీడ్ ద్వీపంలో ప్రమాదకరమైన పరిస్థితులకు సైతం ఎదురొడ్డి విశేషమైన స్థితి స్థాపకత, నిబ్బరాన్ని ప్రదర్శిస్తూ తమ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుంటున్నారు. 1990 నాటి అమెరికా జనాభా లెక్కల ప్రకారం లిటిల్ డయోమీడ్‌లో గరిష్ఠంగా 178 మంది నివసిస్తుండగా– 2010 నాటికి అది 115కు; జనవరి 2023 నాటికి 77కు క్షీణించింది.



ఈ ద్వీపం పశ్చిమ భాగంలోగల ఒక చిన్న బీచ్ ప్రాంతంలోని నివాసితులు తమ ఇళ్ల నుండి రష్యా ఆధీనంలో గల బిగ్ డయోమీడ్‌లోని ఇళ్లను వీక్షించే అవకాశం ఉంది.

ఈ ద్వీపంలో దాదాపు 30 భవనాలు, ఒక పాఠశాల, ఒక లైబ్రరీ, తపాలా కార్యాలయం, చిన్న ప్రాథమిక కేంద్రం, ఒక చర్చి, హెలిపోర్ట్ ఉన్నప్పటికీ రోడ్లు లేవు. పట్టణంలో రెస్టారెంట్‌లు లేదా హోటళ్లు లేవు. అలాస్కాలోని నోమ్ పట్టణం నుండి సముద్రం ద్వారా సరఫరా చేయబడే పరిమితమైన రకాల ఆహారం, దుస్తులు, ఆయుధాలు, ఇంధనం లభించే ఒక దుకాణం మాత్రమే ఇక్కడ ఉంది. ఇక్కడి నివాసితులు తమ ఆహారం కోసం తిమింగలాలను, సీల్‌లతో పాటు తమపై దాడి చేస్తే అవకాశం ఉండే ధృవపు ఎలుగుబంట్లను వేటాడుతారు. ఐవరీ చెక్కడంలో మంచి నైపుణ్యం కలిగిన వీరు తమ ఉత్పాదనలను అలాస్కాలో అమ్ముతారు. ఇక్కడ జనాభా అప్పుడప్పుడు మైనింగ్, భవన నిర్మాణం లాంటి చిన్న ఉద్యోగాలు చేస్తూ ఉంటారు.

1948లో సైనిక స్థావరం స్థాపించబడిన తర్వాత 'బిగ్ డయోమీడ్' ద్వీపంలో శాశ్వత స్థానిక జనాభా లేకుండా పోయింది. సోవియట్ ప్రభుత్వం, ద్వీపంలోని స్థానిక జనాభాను రష్యా ప్రధాన భూభాగానికి తరలించింది. ఇప్పుడు అక్కడ ద్వీపంలో రష్యన్ వాతావరణ కేంద్రం, రష్యన్ బోర్డర్ గార్డ్ దళాల స్థావరాలు నెలకొని ఉన్నాయి. ఈ ద్వీపంలో నిరంతరం నివసించే జనాభా ఉండరు. కేవలం రష్యన్ సైనికులు వస్తూ పోతూ ఉంటారు. అలాగే ఇంటర్నెట్, వార్తా పత్రికలు, వినోదాలు లాంటి సౌకర్యాలు కూడా లేని ఈ ద్వీపంలో ఒకప్పుడు నివసించే ఎస్కిమోస్ కూడా అక్కడి నుండి అలాస్కాకు తరలిపోయారు. ఏదో ఒక దీవి ఉంది అంటే ఉంది. వేడి చేసి కరిగించుకుని తినాలి. ఇక్కడ ఉండే రష్యన్ సైనికులు వారానికి ఒకసారి స్నానం చేస్తారు. ఇక్కడ కొన్ని చోట్ల వాల్రస్ లాంటి నీటి జంతువులు ఉంటాయి.

## దీవుల మధ్య రాకపోకలు

1948 వరకు సోవియట్ మిలిటరీ కఠినమైన సరిహద్దు నియంత్రణను అమలు చేయడం ప్రారంభించే వరకు కూడా ఈ రెండు ద్వీపాల మధ్య రాకపోకలు సాధారణంగానే కొనసాగేవి. సోవియట్‌లు 'బిగ్ డయోమీడ్' జనాభాను సైబీరియా ప్రధాన భూభాగానికి బలవంతంగా తరలించి బిగ్ డయోమీడ్‌లో జనావాసాలు లేకుండా చేసారు. సోవియట్ యూనియన్ చేపట్టిన ఈ చర్య సాధారణంగానే సరిహద్దులో నివసించే కుటుంబాల మధ్య విభజనకు కారణమయ్యింది.

## విచిత్రమైన అనుభూతి

అంతర్జాతీయ తేదీ రేఖకు డయోమీడ్ దీవులు అతి సమీపంలో ఉండడంతో రెండు దీవులలో సమయం చాలా విచిత్రంగా ఉంటుంది. రష్యా, యునైటెడ్ స్టేట్స్ మధ్య సమయ వ్యత్యాసం కారణంగా 'బిగ్ డయోమీడ్' ఒకరోజు ముందు అంటే 'రేపు'లో ఉంటే అదే 'లిటిల్ డయోమీడ్' దాదాపు ఒకరోజు వెనుక అంటే 'ఈరోజు' లేదా 'నిన్న'లో ఉంటుంది. విభిన్న ప్రాంతాలు, సమయంలో వ్యత్యాసం కారణంగా ఈ రెండు దీవులు



అంతర్జాతీయ సరిహద్దుల సంక్లిష్టతలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి. వీటిని సందర్శించినవారు అక్షరాలా భవిష్యత్తు లేదా గతంలోకి అడుగు పెట్టడానికి అవకాశం ఉండడంతో, విచిత్రమైన అనుభూతికి లోనవుతారు. ●

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.

మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

చిన్న కథ

# సమయస్ఫూర్తి

సిహెచ్.నాగార్జున శర్మ

"చప్పిడికూడు తిని తిని జిహ్వాచాపల్యం చచ్చిపోయిందిగానీ ఈరోజు సాయంకాలం రుచిగా తినడానికేమన్నా చేసి పెట్టమ్మా" అన్నది అత్త కొత్త కోడలితో.

"ఏం చెయ్యమంటారో మీరే చెప్పండత్తయ్యా" అన్నది కోడలు.

"మిరపకాయ బజ్జీలు వెయ్యి, తిని చాలా రోజులైంది" అన్నది అత్త.

"మిరపకాయ బజ్జీలా..." అన్నది దీర్ఘాలు తీస్తూ.

"ఏం! దానికి కావలసిన వస్తువులు నిండుకున్నాయా ఏంటి?" అడిగింది అత్త.

"అన్నీ వున్నాయత్తయ్యా! మిరపకాయ బజ్జీలు చెయ్యడానికి అసలువే లేవు. అవే బజ్జీ మిరపకాయలు. అవి లేకుండా మిరపకాయ బజ్జీలెలా చేస్తాం?" అని అడిగింది కోడలు.

"బజ్జీ మిరపకాయలు లేకపోతేనేం? మామూలు పచ్చిమిరపకాయలతో మిరపకాయ బజ్జీలు వేయొచ్చుగా!" అన్నది అత్త.

"వాటితోనా?"

"ఏం? వాటితో చెయ్యడం నీకు చేత కాదా?"

"చేతనవుతుంది.. కాకపోతే బజ్జీలు విపరీతమైన కారంగా వుంటాయని ఆలోచిస్తున్నానత్తయ్యా!" అన్నది కోడలు.

"మిరపకాయ బజ్జీలు కారంగా వుండక కమ్మగుంటయ్యటమ్మా" అన్నది అత్త బిగ్గరగా నవ్వుతూ.

"బజ్జీమిరపకాయలతో అయితే కారం వుండవత్తయ్యా!" అన్నది కోడలు.

"వీటితో గూడా కారం లేకుండా చెయ్యొచ్చు" అని–

"ఏం లేదమ్మాయ్! మిరపకాయను మధ్యకు చీల్చి మిరపగింజల్ని తీసెయ్యి. దాన్ని శెనగపిండిలో ముంచి నూనెలో వేయిస్తే కారముండదు. అదే మిరపగింజలతో పాటు చేస్తే కారం నషాళానికంటుతుంది" అన్నది అత్త.

"అలాగే అత్తయ్యా" అన్నది కోడలు.

శెనగపిండి కలిపి తయారుగా వుంచుకుంది. ఆ తరువాత ఏడు పచ్చిమిరపకాయలు తీసుకుని వాటిని చాకుతో మధ్యకు చీల్చి అందులో ఉన్న మిరపగింజలన్నింటినీ తీసివేస్తున్నది. అలా ఐదు మిరపకాయల్లో గింజల్ని తీసేపాటికి కోడలికి విసుగొచ్చేసింది.

ఇంతలో అత్తగారు "ఏం కోడలుపిల్లా! బజ్జీలు ఇంకా తయారవలేదా?" అని తొందర పెడుతున్నారు.

అలా అత్తగారు తొందర పెట్టడంతో కోడలుపిల్లకు చిరాకేసి మిగిలిన రెండు పచ్చిమిరపకాయల్ని మధ్యకు చీల్చి గింజలు తీయ్యకుండానే శెనగపిండిలో ముంచి నూనెలో వేసేసింది. వాటిని బాగా వేయించింది. వేగిన మిరపకాయ బజ్జీలన్నింటిని ఒక గిన్నెలోకి తీసింది.

కోడలు తనకి మూడు మిరపకాయ బజ్జీలు పెట్టుకుని, నాలుగు బజ్జీలు అత్తయ్యకు పెట్టింది.

అత్తయ్య రెండు బజ్జీలు తిని, "చూడు.. నేను చెప్పినట్లు చెయ్యడం వల్ల కారం అస్సలు లేదు" అన్నది అత్త.

వెనువెంటనే అత్తగారు మూడవ బజ్జీ తినగానే కారం నషాళానికంటి నాలుక భగభగ మండిపోయింది. కళ్లల్లోంచి కన్నీళ్లు జలజలా రాలుతున్నాయి. మంచినీళ్లు... మంచినీళ్లు..." అని ఒకటే కేకలు పెడుతున్నారు అత్తగారు ఆపకుండా.

"మంచినీళ్లిద్దామంటే కుండలో నీళ్లు నిండుకున్నాయి"

"ఓరి భగవంతుడా! ఇప్పుడేమిటి చెయ్యడం?" అని చెంపకు చెయ్యి ఆనించుకుని ఆలోచిస్తూ కూర్చుంది కోడలు.

"చెంపకు చెయ్యి ఆనించుకుని అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చోనుండకపోతే కాస్త పంచదార నా ముఖాన కొట్టొచ్చుగా!" అని బిగ్గరగా అరుస్తున్నది అత్త. "పంచదార కూడా నిండుకున్నదత్తయ్యా!"

"ఈ కొంపలో అన్నీ నిండుకుంటూనే వుంటాయి. ఫలానా వస్తువు ఇంట్లో ఉంది అని ఏనాడైనా చెప్పావా? వెధవ బతుకని... వెధవ బతుకని" అత్త మండిపడ్డది కోడలిపై.

ఆ మాటలు విన్న కోడలికి మెరుపు లాంటి ఆలోచన వచ్చి "ఉండండత్తయ్యా! దేవుడి దగ్గర తిరుమల లడ్డు ఉన్నది, తీసుకొస్తాను" అని అత్తగారి చేత తిరుమల లడ్డూని తినిపించి భగభగ మండిపోతున్న కారం నుండి అత్తగారిని ఉపశమింపజేసింది కోడలుపిల్ల. •

(24వ పేజీ తరువాయి..)

## అన్నీ నా కోసం...

ప్రాణాలు కోల్పోవడం కూడా తెలిసిందే కదా. ఇక్కడే ఇంకొక విషయం కూడా చెప్పాలి... చెత్తకుప్పలు తీసివేసి శుభ్రం చేయడానికి వచ్చే లారీలలో కూడా కొన్ని సార్లు చెత్తను సరిగ్గా ఉంచకపోవడం వల్ల అదంతా రోడ్లమ్మట పడి ప్రమాదాలకు కారణమవుతుంటాయి. ఆ మధ్య ఓ రహదారిలో పెట్రోలు వాహనం ఒకటి బోల్తా పడి పెట్రోల్ అంతా రోడ్లమ్మట పడినప్పుడు అది బాగు చేసిన తర్వాత వెళ్దామనే ఆలోచన లేకుండా కిందా మీదా పడుతూ వెళ్లి గాయపడ్డవారి గురించి పత్రికలో చదివే ఉంటాం. ద్విచక్ర వాహనాలు జారిపడతాయన్న విషయాన్ని మరచి రోడ్ల మీద గుమ్మడికాయలు కొడుతుండటం చూస్తూ ఉంటాం. ఇది ఎంతటి నిర్లక్ష్యమో వేరేగా చెప్పాలా?

ఇటువంటివన్నీ చూస్తున్నా, చదువుతున్నా, వింటున్నా భయమేస్తుంది రోడ్ల మీద పోవడానికి. ఇలా ఒకటేమిటి.. రకరకాల కారణాలతో నన్ను నిర్లక్ష్యం చేస్తూ కనిపించే మనుషుల కోసం రాసిన ఈ నాలుగు మాటలు చదివైనా సన్మార్గంలో నడవటానికి ప్రయత్నిస్తారని ఓ ఆశ. అంతకన్నా ఇంకేమీ కాదు. పుట్టిన వారందరూ ఏదో ఓ రోజు మరణించడం తథ్యం. సాఫీగా పోవలసిన ప్రాణం అష్టకష్టాలు పడిపోవాలా? అదేమన్నా బాగుంటుందా?... ఆలోచించండి... ఇప్పటికైనా నన్ను సవ్యంగా చూసుకుంటారని నా ఆశ.

ఇట్లు

మీ ప్రాణం •



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. బ్యాంకింగ్ విషయాలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి.

## వృషభం



నూతన పరిచయస్తులతో మిత్రత్వం ఏర్పరచుకుంటారు. మాటకారితనంతో మీ పనులు సానుకూల పరచుకుంటారు. మీరు చేసే ప్రతి పని వివేకంతో కూడా ఉంటుంది. ఆర్థికంగా లోటు ఉండదు. ఇతరుల వత్తిడికి తలొగ్గి మీకు ఇష్టం లేని కార్యక్రమం చేయాల్సి వస్తుంది. నిర్మాణపు పనులు సంతృప్తి కరంగా తోచవు. ఉద్యోగంలో మీ స్థానం పదిలమవుతుంది.

## మిథునం




తల్లిదండ్రుల పట్ల, సహోదరీ వర్గం పట్ల విశేషమైన ప్రేమ కలిగి వుంటారు. బాధ్యతల నిర్వహణలో వెనకడుగు వేయరు. మీ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేస్తారు. వివాదాస్పద అంశాలను ప్రాథమిక దశలోనే సర్దుబాటు చేసుకుంటారు. మీకు రావలసిన బిల్స్ సకాలంలో చేతికందుతాయి. ఇ-మెయిల్స్ వంటివి సరిచూసుకోవడం మంచిది.

## కర్కాటకం



వ్యాపార సంస్థలలోని వారికి అనుకూలం. ఉద్యోగస్తులు ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం మంచిది. స్నేహితులకు మీ సహాయ సహకారాలు అందిస్తారు. దీనిని మీ కుటుంబ సభ్యులు వృథా ఖర్చులుగా భావిస్తారు. అనవసరమైన విషయాల పైన దృష్టి సారిస్తారు. మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు ఎక్కువవుతారు.

## సింహం



వ్యాపార పరంగా లాభాలు చేతికందివస్తాయి. చెల్లింపులను సకాలంలో చెల్లిస్తారు. పనిభారం వలన సమయం సరిపోదు. సంతాన విద్యావసరాలకు పుస్తకాలు లేక తత్సంబంధమైన వాటిని కొనుగోలు చేస్తారు. మీ ఆలోచనలు కొంతవరకు కార్యరూపం సంతరించుకుంటాయి. ఇతరులకు మేలు చేస్తేనే భగవంతుడు మనకు సహాయం చేస్తాడని నమ్ముతారు.

## కన్య



కుటుంబ పరిస్థితులపై దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఆర్థికంగా సర్దుబాట్లు చేయడం శక్తికి మించిన పనవుతుంది. తక్కువ శ్రమతో మంచి ఫలితాలు సాధిస్తారు. మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తూనే ఉంటుంది. ఈ ఆలోచనలకు మాత్రం తెరపడదు. ఉద్యోగస్తులకు చెప్పుకోదగిన మార్పులేవీ ఉండవు. వ్యాపారంలో మరిన్ని లాభాల కోసం కృషి చేస్తారు.

## తుల



ఆర్థిక పరమైన విషయాలలో కచ్చితంగా వ్యవహరిస్తారు. టెండర్లు, జాబ్ వర్కులు, ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి. సమాచార, సంబంధిత విషయాలను ఇతరులకు అప్పజెప్పనంతవరకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. చెక్కులు తీసుకునేటప్పుడు జాగ్రత్త వహించండి, అవి బౌన్స్ అయ్యే అవకాశం ఉంది. సన్నిహితుల సహాయ సహకారాలు అందుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## వృశ్చికం



కార్యాలయాలలో అధికంగా శ్రమిస్తారు. మనలో తప్పు లేనప్పుడు ఎవరికీ తల వంచాల్సిన అవసరం లేదని భావిస్తారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యంగా ఉండగలుగుతారు. కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఉన్నత స్థానంలోనివారు మీ పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని భావిస్తారు. అపోహలు పెనుదుమారం సృష్టిస్తాయి. కనుక ఈ విషయంలో జాగ్రత్తలు వహించండి.

## ధనుస్సు



అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లబ్ధి పొందుతారు. సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రత్యేకతను కనబరుస్తారు. పెద్దరికాన్ని కలిగి వుంటారు. ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టగలుగుతారు. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. పనులు పూర్తి అయ్యేవరకు మీ మనస్సులోని మాటను బయటకు పొక్కనివ్వకండి. వృత్తి, ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులేవీ ఉండవు.

## మకరం



ముఖ్యమైన పనులు సానుకూల పడతాయి. ఒకరికిచ్చిన మాటను నిలబెట్టుకుంటారు. రుణాలను కొంతవరకు తీరుస్తారు. ఉన్నత విద్యా, ఉద్యోగ వ్యవహారాలు ఓ కొలిక్కి వస్తాయి. కోర్టుకేసులు వాయిదా పడతాయి. మనస్సుకు సంతోషం కలిగించే విధంగా ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. వ్యక్తిగత అభివృద్ధికి ఉపకరించే కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు.

## కుంభం



నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. భాగస్వాములు, నమ్మిన స్నేహితులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. విద్యా, సాహిత్య కళా రంగాల్లోని వారికి అనుకూలం. తక్కువ కాలంలో సాగే తాత్కాలిక వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి. కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయి. నిర్మాణాత్మక కార్యక్రమాలలో పురోభివృద్ధి సాధిస్తారు.

## మీనం



ఉపకరించే అంశాలు ఎక్కువగా ఉన్నాయి. నూతన వస్తు, వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. బంధుత్వాలు మరింత బలపడతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలం. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. మీ అభిరుచికి తగిన విధంగా గృహం కొనుగోలు చేస్తారు. ప్రయాణాల వల్ల అలసిపోతారు. ఆలోచనలు సరైన దారిలో సాగుతాయి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వల్ల లాభపడతారు.

# ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏ దిక్కులో ఉండాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**


**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




ఓవర్‌హెడ్ ట్యాంక్స్ అంటే ఇంటి పైన ఏర్పాటు చేసుకునే నీటికూపాలు అని చెప్పవచ్చు. ఈ ఓవర్‌హెడ్ టాంక్స్‌ని ఎక్కడ పడితే అక్కడ నిర్మించకూడదు. జలధార (ట్యాంక్‌లోని నీరు వచ్చి, పోయే విధానం) పద్ధతులను కూడా అనుసరించాలి. ట్యాంక్‌లో పడే నీరు పశ్చిమ లేదా దక్షిణ దిక్కు నుండి రావాలి. బయటకు వెళ్లే నీరు తూర్పు, ఈశాన్యం లేదా ఉత్తర దిక్కుగా ముందు ప్రవహించాలి. ఈ ట్యాంక్‌ల నిర్మాణం ఫలాపలాలు:



## ఉత్తర ఈశాన్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-ప్రతికూలం

ఉత్తర ఈశాన్యంలో నేల మీద బావి వుంటే శుభ ఫలితాలేగానీ, కప్పు పైన ఉత్తర ఈశాన్యంలో ఓవర్‌హెడ్ మంచిది కాదు. కప్పు పైన ఖాళీగా వుండవలసిన ఉత్తర ఈశాన్యంలో నీటిభారం వేయడం వలన ఇంటి యజమానికి ఆర్థిక బాధలు తప్పవు.

**శుభా శుభ ఫలితాలు:** అసౌఖ్యం, ఆర్థికాభివృద్ధి నిరోధకం.

**East North-East Overhead tank-Unfavourable**

A well towards East North-East gives favourable results. But overhead tank towards North North-East on the terrace gives unfavourable results. The head of the family suffers from financial crisis.

**Likely Result:** Lack of Mental peace, financial crisis.

## ఉత్తరంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-ప్రతికూలం

కప్పుపైన ఖాళీగా వుండవలసిన కుబేర స్థానంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వలన నీటిభారం పడుతుంది. ఉత్తరం భారం అవడం వలన సహజంగానే ఆర్థిక సమస్యలు మొదలవుతాయి.

**శుభా శుభ ఫలితాలు:** సమాజంలో చులకన, వ్యాపార వ్యవహారాలలో ధన నష్టం.

**North Overhead tank-Unfavourable**

North is considered as Kubera's place(the diety of prosperity) a overhead tank on the terrace towards North gives unfavourable results.

**Likely Result:** Financial crisis.

## ఉత్తర వాయవ్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-ప్రతికూలం

ఖాళీగా వుండవలసిన ఉత్తర వాయవ్యం ఓవర్‌హెడ్ ట్యాంక్ కట్టడం వలన జలభారంతో కూడి వాస్తుకు అనుకూలం కాక చెడు ఫలితాలను పొందవలసి వస్తుంది.

**శుభా శుభ ఫలితాలు:** అస్వతంత్రత, వ్యాజ్యాలు(కోర్టుకేసులు), ధన నష్టం.

**North North-East Overhead tank-Unvafourable**

North North-East must be a vacant place. An overhead tank towards North-East is against vaasthu which gives unfavourable results.

**Likely Result:** Feeling of insecurity, loss of money and legal cases.

## వాయవ్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-ప్రతికూలం

ఖాళీగా వుండవలసిన వాయవ్యం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వలన భారం అవడమే కాక, వాయవ్య మూల కప్పబడిపోతుంది. యజమాని ఇక్కట్ల పాలవడం ప్రారంభమవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** అస్వతంత్రత, వ్యాజ్యాలు(కోర్టుకేసులు), అనవసర వ్యయం.

**North-West Overhead tank-Unfavourable**

North-West must be a vacant place. An overhead tank towards North-West gives unfavourable results.

**Likely Result:** Insecurity feelings, losses in business dealings, waste of money.

## పశ్చిమ వాయవ్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-ప్రతికూలం

ఆకాశానికి తెరిచి వుంచవలసిన పశ్చిమ వాయవ్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయడం వలన వాయవ్యం కప్పబడిపోవడమే కాక, భారం ఏర్పడుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** మానసిక రుగ్మతలు, ఆర్థిక సమస్యలు.


**West North-West Overhead tank-Unvafourable**

West North-West must be a vacant place. An overhead tank towards West North-West gives unfavourable results.

**Likely Result:** Lack of mental peace, financial crisis.

# పదరంగం-12

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. సమయాన్ని వెళ్లబుచ్చడం (5)
3. ఇవ్వు(వాడుక భాషలో) (1)
6. తిరగబడ్డ ఆజ్ఞ (3)
7. లంచాలు సరిగా లేవు (4)
9. అటునుంచి దేవాలయం (3)
10. తిరగబడ్డ చిల్లు (2)
12. ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ .....(5)
13. గొప్పగా (3)
14. మిశ్రమం, కలగలుపు సరిగా లేదు (4)
16. ఖాళీ కడుపు సరిగా లేదు (5)
20. చేసేది (2)
22. అటు నుంచి వచ్చిన దుస్వప్నం (4)
23. పశువు మెడకు కట్టే కొయ్య (4)

### నిలువు

1. రక్షించు (3)
2. రాత్రి కాదు (3)
4. తోక లేని చెవుల పిల్లి (2)
5. మచ్చ, చెడ్డ పేరు (3)
6. కాళిదాసకృత పద్యకావ్యం పైకొచ్చింది (5)
8...... పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించడం అని సామెత (5)
10. మన పొరుగు రాష్ట్రం (5)
11. ఒక రాగం (5)
15. ఒక పూవు (3)
16. బయట (4)
17. కన్యాశుల్కం నాటకకర్త (4)
19. మిర్చిబజ్జీ తోబుట్టువు (3)
21. పిల్లలు ఆడుకునేది పైకెగిరింది (2)

**పదరంగం-10కి జవాబులు పంపించినవారు**

1. కె.ప్రభాకర్-కోదాడ
2. జి.సుబ్రహ్మణ్యం గౌడ్-రాజంపేట

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ................................................


................................................


ఊరు : ................................................


## పదరంగం-10 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ర[1] | వీం | ద్ర | నా[2] | ధ్ | రా | గూ[3] | ర్ | | ప[4] |
| మా | | | గ | | | డు | | త[5] | ట్టు |
| ర[6] | ట్నం | క | వ | | అ[7] | పు | రూ | పం | |
| మి | | | ల్లి[8] | పి[9] | | రా | | దా[10] | డీ[11] |
| | | య్యు[12] | | త[13] | రు | ణి | | | లా |
| ర[14] | మె | క | | లా | | | జా[15] | న | కి |
| స | | వెం[16] | క | ట | ర | మ[17] | ణ | | |
| కం[18] | బ | ళి | | కం | | ధు | | పు[19] | ట్టు |
| దా | | గ | | | అ[20] | ర | సు | న్న | |
| యం | | పిం[21] | డి | వం | ట | | | మి[22] | ష |


# ఈ వారం కా'ర్టూన్స్'


బాబాయ్ చనిపోయాడని మొన్న సెలవు తీసుకున్నా కదా..' పెద్ద కర్మ'కు సెలవు తీసుకోకుంటే బాస్‌కు డౌట్ రాదూ..?!
జనరల్ మేనేజరు
URGENT FILES
LEAVE
Zakir...


ఆ పార్టీ ఒక దగుల్బాజీ పార్టీ అని గెలిచిన ఏడేళ్ల తర్వాత తెల్సింది.. అందుకే ఈసారి ఈ పార్టీ నుండి పోటీ చేస్తున్నా..!!
ఓటరు
Zakir...


ఏంటే కలిపి తినిపించాలా? నీవేమైనా ఓటరువా?!
Zakir...





ఫోటో ఫీచర్





జీవిత
కాలపు జ్ఞాపకాలను
పదిలపరచుకోవాలంటే అమెరికాలోని
యూతా రాష్ట్రంలోని జియాన్ నేషనల్ పార్క్
సందర్శించాలి. ఇక్కడి 'ది నారోస్' టూరిస్టులకు,
సాహసికులకు ఇష్టమైన ప్రదేశం. పేరుకు తగ్గట్లుగా
ఈ దారంతా ఎత్తయిన కొండల మధ్య ఇరుగ్గా,
సన్నగా ఉంటుంది. సన్నని ఈ దారంతా నదీ
ప్రవాహం. కొత్త కొత్త ప్రదేశాలు
పర్యటించాలనుకునే వారిని 'ది నారోస్'
రా.. రా.. రమ్మని
ఆహ్వానిస్తున్నట్లుంది.



